అప్పయ్య దీక్షితుల ఆత్మార్పణ స్తుతి - తాత్పర్య విశేషాలు

(ప్రథమ సంపుటము)

AATMARPANA STUTHI

Author
Dr. Tadepalli Patanjali
*Website:***https://sites.google.com/site/annamayyapatanjali/**

ఓం శ్రీ గురవే నమః

అప్పయ్య దీక్షితుల ఆత్మార్పణ స్తుతి

తాత్పర్యవిశేషాలు

డా.తాడేపల్లి పతంజలి

దివ్యస్థలం, తిరుచానూరు

పరిచయం

అప్పయ్య దీక్షితులు తమిళ నాడు లోని ఆర్కాట్ జిల్లాలో "అడయప్పాలెం" గ్రామం లో జన్మించారు . 1554-1626 కాలంవాడు . మహా వైయాకరణుడు అయిన భట్టోజీ దీక్షితులు వీరి వద్ద వేదాంత శాస్త్రాధ్యయనం చేశాడు . గురువు ను గురించి స్తుతిస్తూ "ఒక వ్యక్తి పండితుడు ఔనా కాదా అని చెప్పటానికి ఎవని గ్రంధాలు అర్ధం చేసుకోవటం,అర్ధం చేసుకోక పోవటం అనేవి నిర్ణాయక ప్రమాణాలో అలాంటి సమస్త విద్యా గురు వైన ఆప్పయ్య దీక్షితులకు నమస్కారం". అని భట్టోజీ దీక్షితులు అన్నారు.

ఈయన సోదరుని మనుమడు మహా కవి అయిన నీల కంఠ దీక్షితులు 1637లో "నీల కంఠ విజయ చంపువు" రాశాడని పుల్లెల వారన్నారు . తన పన్నెండవ ఏటనే అప్పయ్య దీక్షితుల ఆశీస్సులు పొందాడు

"మహేశ్వరే వా" అని చెప్పుకొన్న అప్పయ్య దీక్షితులు దక్షిణదేశంలో వైష్ణవాన్ని బౌద్ధాన్ని ఎదుర్కోవటం కోసం శివ పారమ్యాన్ని ప్రతి పాదిస్తూ అనేక గ్రంధాలు రచించారు.

"దీక్షితులు సాక్షాత్ పరమ శివావతారమే" అవతార పురుషులే అని శ్రీ కంచి పరమాచార్యుల వారన్నారు. వారు అప్పయ్య దీక్షితుల గురించి చెప్పిన విశేషాలు కొన్ని. (జగద్గురు బోధలు సౌజన్యం)

ఉన్మత్త శిఖరాయనమః

అసలే పిచ్చివాడు (ఉన్మత్తుడు) ఆస్థితి శిఖరం చేరితే ఇక ఎలాఉంటుంది? అంటే పిచ్చివాళ్లకే పిచ్చివాడని అర్థం. పిచ్చివాళ్లంతా ఓచోట చేరి **అదిగో ఆ ఫలానా వ్యక్తి ఉన్నాడే వాడు పిచ్చివాడురా, అటు వెళ్లకండి...** అనే స్థాయిలో ఉండేవాడిని ఉన్మత్త శిఖరుడు అనవచ్చు. అలాంటి వాడిని స్మరిస్తూ, **ఉన్మత్త శిఖరాయ నమః** అని పూజచేయడం ఏమిటీ - అన్న సందేహం రావచ్చు. ఇంతకీ ఈ ఉన్మత్త శిఖరుడు ఎవరంటే ఆ పరమశివుడే. పిచ్చివాళ్లకు పిచ్చివాడు. ఏదీ అక్కరలేనివాడు. ఏమీ కోరనివాడు. ఏ స్థితీ అతనికి ఇష్టంకాదు. మరే స్థితి అతనికి కష్టం కాదు.

జ్ఞానియొక్క స్థితి "బాలోన్మత్త పిశాచవత్" లని వర్ణిస్తుంటారు. అనగా జ్ఞానులు పిల్లవాండ్లలాగా పిచ్చివాండ్లలాగా ఉంటారని అర్థం. పిచ్చి తలకు ఎక్కినవాడు ఉన్మత్తుడు. ఉమ్మెత్త పువ్వునుకూడా ఉన్మత్తమని అంటారు. దీనిని తింటే పిచ్చి పట్టుతుందని సాధారణంగా చెపుతుంటారు. ఈపూవంటే ఈశ్వరునికి చాలాఇష్టం. ఆయన ఉన్మత్త శేఖరుడు. అంటే ఉమ్మెత్త పూవులను శిరసులో దాల్చినవాడని ఒక అర్థం. పిచ్చివాళ్ళలో అగ్రేసరుడని మరొక అర్థం. పిచ్చివానివలే తిరగడమంటే పరమశివునికి పరమప్రీతి. తుమ్మి, ఉమ్మెత్త, జిల్లేడు ఇవంటే ఈశ్వరునికి ప్రియం. వీనికి ఈ కాలంలోకూడా వెలలేదు. ఎవరైనా వీనిని కోస్తుంటే 'ఎందుకు కోస్తున్నావు?' అని అడ్డుచెప్పరు. వీనిని సంపాదించడానికి ఏవిధమైనా శ్రమలేదు. జిల్లేడులో తెల్ల జిల్లేడు విశేషం. ఇట్టి వెల లేని వస్తువులతో ఆయనను పూజిస్తే ఆ పిచ్చివానికి, ఆ ఉన్మత్త శేఖరునికి చాలాఇష్టం.

ఈశ్వరుడొక మహారాజుగా ఉండిఉంటే వాని దర్శనం దుర్లభం. కాని అదృష్టవశాత్తు అతడొక భిక్షుకుడుగానూ, ఉన్మత్తుడుగానూ ఉన్నాడు కనుక వాని దర్శనం చాలా సులభం. కొంతకాలం పిచ్చి ఉన్నవానికి పాపాలు తక్కువ అనిఅన్నాము. ఈతనికి ఎప్పుడూ పిచ్చే అందుచే పాపాలకు అతీతుడు. మనమున్నూ పాపవిముక్తికోసం పాటుపడవలెనంటే, ఆవలిగట్టు చేరుకొన వలెనంటే సర్వపాపములకున్నూ అతీతుడైన ఆ సర్వేశ్వరుని ప్రాపకం పొందాలి. అడుసులో ఉన్నవానిని గట్టుపై ఉన్న వాడులాగి బయటకు వేయగలడు. కాని అడుసులోనే చిక్కుకొని పరితపించే మరొక అసహాయుడు ఎవరికయినా సహాయం చేయగలడా ?

సుందరమూర్తి శివభక్తులలో ఒకడు. ఆయన శివునికి "తడుత్తు ఆడ్కొండా" అన్న బిరుదు ఇచ్చాడు. ఈపదానికి తెలుగులో "అడ్డువచ్చి రక్షించినవాడు" అని అర్థం. సుందరమూర్తికథ చాలా చిత్రంగానూ, సుందరంగానూ ఉంటుంది.

సుందరమూర్తి బ్రాహ్మణకులంలో పుట్టాడు. జన్మక్షేత్రం తిరువారూర్. యుక్తవయస్సు వచ్చేసరికి తండ్రి. ఒక సంబంధంకుదిర్చి ముహూర్తం నిర్ణయిస్తాడు. ఆ ముహూర్తంనాడు పెళ్ళిపీటలమీద పెళ్ళికొడుకు కూచునిఉంటాడు. వధువు వచ్చే సమయంలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు కల్యాణమంటపం సమీపించి "ఈసుందరమూర్తి నాదాసుడు. అందుచే నాకు దాస్యం చేయడానికి రావాలి" - అని అంటాడు. నీకేమైన పిచ్చా, వెఱ్ఱా? పోపో, అని సుందరమూర్తి అతనిని కసురుకుంటాడు.

నీవు కసురుకుంటే నేను వదలి పెడతానా? చూడు మా తాత వంశపారంపర్యంగా నాకు దాస్యం చేస్తామని వ్రాసియిచ్చిన పత్రం" అని ఆవృద్ధుడు ఒక పత్రం చూపెడతాడు. అందులో తాతగారి వ్రాలు ఉంటుంది. అంతటితో సుందరమూర్తి నిర్వణ్ణుడై ఆవృద్ధ బ్రాహ్మణున్ని అనుగమిస్తాడు. ఆ వృద్ధుడు నడచి, నడచి ఒక శివాలయంలోదూరి ఆదృశ్యుడౌతాడు. సుందరమూర్తి ఆలయంలోనికి వెళ్ళిచూస్తే పార్వతీసమేతుడైన పరమశివు డాతనికి దర్శనమిచ్చి నీవుప్రమథగణానికి చెందినవాడవు. శాపవశాత్తు ఈలోకంలో పుట్టినావు. శాపకాలంలో ఎక్కడఉన్నా "నీ దాసత్వం మాత్రం నాకు అనుగ్రహించు' అని నీవునన్ను వేదుకొన్నందువల్ల ఈవిధంగా నాటకమాడి నిన్ను నా దాసునిగా చేసుకొన్నాను, అని విశదపరుస్తాడు. తన పెళ్ళి అడ్డగించి తన్ను రక్షించిదాసునిగా స్వీకరించినాడు గనుగ – శివుని "తడత్తు ఆట్కొండాన్" అనివర్ణించి "పిత్తాపిరై చూడి పెరుకూనే అరుళాళా" అన్న మకుటంతో ఒక పదికమును సుందరమూర్తి గానం చేశారు.

సాధారణంగా మనం మంచివారమనే అనుకొంటాం. సదాలోచననే చేస్తున్నామనీ అనుకొంటాం. కానీ ఒక్కొక్కప్పుడు మనకువచ్చే కలలను పరిశీలిస్తే అంతర్గతంగా ఎట్టి పాపాలోచనలు చేస్తున్నామో అవగతం అవుతుంది. జాగ్రదవస్థలో తలచడానికికూడా యోగ్యతలేని యోచనలన్నీ స్వప్నంలో విశదము అవుతూఉంటవి. నిజానికి జీవితంలో తీరని అభిలాషల స్వరూపమే స్వప్నం. అందుచే మనం చెడ్డకలలు కనకపోతే అంతవరకు జీవితాన్ని శుద్ధిచేసుకొన్నామని అర్థం. అట్లుకాక పాపకార్యాలు చేస్తున్నట్లుగానీ, పాపాలోచనలు చేస్తున్నట్లుగానీ కలలుకంటే ఇంకా చిత్తశుద్ధి మనకు పూర్ణంగా అంటలేదని తెలుసుకోగలం. తమ్ముతాము పరీక్షించుకోడానికి ఈశ్వరుడు స్వప్నావస్థను కల్పిస్తాడు.

అప్పయ్య దీక్షితులవారికి ఈస్వప్నమర్మం తెలుసు. అయన శివ పూజ చేస్తున్నట్లూ శివారాధన చేస్తున్నట్లూ ఎన్నో మార్లు కలగని ఉన్నారు. శివపరములైన గ్రంథాలనెన్నో వ్రాసినారు. ఇతర మనగ్రంథాలనూ నిష్పాక్షికంగా వ్రాశారు. కాని తానుమాత్రం అద్వైతి.

మహేశ్వరేవా జగతా మధీశ్వరే జనార్దనేవా జగదంతరాత్మని,
నవస్తు భేద ప్రతిపత్తి రస్తిమే తథాపి భక్తిస్తరుణేందు శేఖరే.

రెండువస్తువు లున్నవని నేను అనుకోలేదు. రెండూ ఒక్కటేఅన్న తీర్మానమె నాకు. అని అప్పయ్యదీక్షితుల వారు తనకు అద్వైతమందున్న అపారభక్తిని ప్రకటించినారు.

దీక్షితులవారు తమ్ముతాము పరీక్షించుకోడానికి మార్గమేదని ఆలోచించి, మనంగా ఉన్మత్తావస్థను తెచ్చుకొంటే ఆసమయంలో మన మాటలు చేష్టలు, ఏలా ఉంటవో, అవే మన నైజగుణానికి చిహ్నాలుగా ఉంటవని తీర్మానించి శిష్యులను పిలిచి తాను మందుతిని పిచ్చిగా ఉన్నప్పుడు చెప్పే మాటలన్నిటినీ వ్రాసి ఉంచమనిచెప్పి, పిచ్చి నిమ్మళించడానికి ఇవ్వవలసిన ఔషధమున్నూ వారికిచెప్పి పిచ్చివాడై పోయాడు. అంతటితో ఆయనకు ఉన్మాద ప్రలాపములున్నూ ఆరంభమైనవి. శిష్యులు ఆయన చెప్పినట్లే వాగినదంతా వ్రాసుకొన్నారు. కొంతసేపటికి నివారణౌషధం ఇవ్వగా దీక్షితుల వారికి స్వస్థత కలిగింది. ఆ ఉన్మాదావస్థలో ఆయన ఏబది శ్లోకాలు ఆశువుగా చెప్పారట. వానికి ఆత్మార్పణస్తుతి అనీ, ఉన్మత్త పంచశతి అనీ పేర్లు. అందులోనిదే ఈ శ్లోకం.

దీక్షితులవారిని ఉన్మదావస్థలోనూ, శివస్మరణ వీడలేదు. తన్మయతతో బాష్ప నేత్రాలతో ఆయన శివునే తలుస్తూ ఉండినాడు. పిచ్చి ఎత్తినప్పటికీ బుద్ధిమారకుండా ఒకే ఆత్మ ఉన్నందున శివస్మరణ చేసినాడు. ఎటువంటి కష్టములు వచ్చినప్పటికీ, ఎటువంటి వ్యాధులు వచ్చినప్పటికీ దైవస్మరణ మాత్రం మనం వదలరాదు. ఆంత్యకాలంలో ప్రాణావసాన సమయంలో ఏ స్మరణతో ఉంటామో దాని కనుగుణంగా మరుసటి జన్మలో శరీరం కలుగుతుందని గీత చెపుతుంది.

యం యం వాపి స్మరన్భావం త్యజత్యంతే కళేబరం,
తం తమే వైతి కౌంతేయ సదా తద్భావ భావితః,

ఈశ్వర స్మరణతో దేహాన్ని వదిలినట్లయితే ఈశ్వర స్వరూపంలో ఐక్యమవుతాము. దుఃఖిస్తూ ప్రాణాలను వదిలితే దుఃఖ భాజనమైన మరొక శరీరం మనకు లభిస్తుంది. అంతిమక్షణాలలో ఈశ్వరస్మరణ వుండవలెనని జీవితమంతా జపధ్యానాదులతో గడపవలసిన అవసరమేమి? అప్పుడు మాత్రం భగవంతుని తలిస్తే చాలదా? అని అడుగవచ్చును. నియమంగా అనుష్ఠానం జరిపే వారికే ఒక చిన్న కష్టం వస్తే దైవ విస్మరణ కలుగుతుంటే అంత్యకాలంలో చూచుకొందాములే అని సోమరి పోతులై కూర్చుంటే శరీరత్యాగ సమయంలో మనకు ఈశ్వరస్మరణ ఎట్లా కలుగుతుంది.

అందుచేతనే కుటుంబంలో ఎలాంటి కష్టములు ఉన్నప్పటికిన్నీ దేహానికి ఎలాంటి రుగ్మత వచ్చినప్పటికిన్నీ, అన్ని శ్రమలనూ ఎప్పటికప్పుడే ప్రక్కకు నెట్టుతూ జన్మ నివృత్తికోసం పాటుపడుతూ ఈశ్వరస్మరణ అనవరతమూ చేసే అలవాటు కలిగిందా లేదా అని ఒక్కొక్కనాడు స్వప్నావస్థనుబట్టి మనలను మనం పరీక్షించుకుంటూ వుండవలె, మనం క్షేమంగా ఉండాలంటే మంచి కార్యాలు చేస్తుండాలి. మంచికార్యం ఏదంటే భగవచ్చింతనయే! వాచికంగా చెప్పుతూ భగవచ్చింతన చేయడం ఒక విధం. మానసికంగా చేయడం మరీ విశేషం. దాన్నే అంతరంగిక భక్తి అని అంటారు. ఎప్పుడూ ఏదో కార్యంచేస్తూ అందులో మగ్నులమైపోయి దైవాన్ని తలవకపోవచ్చు. కాని పనిపూర్తికాగానే వెనువెంటనే ఈశ్వర చింతన కలుగవలె. ఇట్లు విరామమున్నప్పుడల్లా నామస్మరణ స్వరూప ధ్యానం చేసే అలవాటు మనం కలిగించుకోవాలి. అభ్యాసం ముదిరేకొద్దీ చింతన సహజమై పోతుంది. దీనికి ఆదర్శం అప్పయ్య దీక్షితులే.

ఈశ్వరుడు బిచ్చగాడు. పూర్వకాలంలో బ్రాహ్మడొకడే బిచ్చ మెత్తేవాడు. ఇతర జాతులవారు అయాచితంగా వచ్చిన వానిని కూడా స్వీకరించేవారుకారు. కుంభకోణంలో "బిచ్చమెత్తే బ్రాహ్మల వీథి' అనేఒక వీధి కూడా వుండేది. బ్రాహ్మణ సన్యాసులు అన్న భిక్షయాచించేవారు. ఇతరులు ధాన్య భిక్షను గ్రహించేవారు. ఉంఛవృత్తి చేసేవారు. ఇతర జాతులకు యాచించే గుణం లేదు. ఏదోపనిచేసి దానికిబదులు కూలితీసుకొనేవారు. ఆ వ్యవస్థలన్నీ ఇప్పుడు మారిపోయినవి.

కూరత్తాళ్వారు కాషాయాలు ధరించి, చోళరాజు సభకు వచ్చారు. రామానుజులు వీరేనా? అని రాజు అడిగిన ప్రశ్నకు రాజుగారిమంత్రి **రామానుజులతో సమాన ఆధిక్యంకలవారే** అని సూక్ష్మంగా తేల్చి వేశారట. శాస్త్రార్థాలుఆరంభమయినవి. పండితులు రావడమూ, దానికేకదా! వచ్చిన విద్వాంసులు లెక్క లేనంతమంది. వారందరూ తీర్మానించి, శివుని కంటే అధికుడు వేరే లేడని వాక్యార్థం చెప్పి **శివా త్పరతరం నాస్తి** అని తాళపత్రం మీద వ్రాసి కూరత్తాళ్వారులతో మీకు ఆక్షేపం ఉంటే చెప్పండి, లేకుంటే దీని మీద చేవ్రాలు పెట్టండి. అని దానిని ఆయనముందు ఉంచారట. కూరత్తాళ్వార్లు సామాన్యులుకాదు. గొప్ప విద్వాంసులు. వెంటనే దానిని అందుకొని "అస్తిద్రోణ మతః పరం' అని పూరించినారట. శివునికంటే పరతరం వేరే ఉన్నది. అది ద్రోణము. శివునికంటే అధికమైనది తుమ్మిపూవు అని ఆయన చమత్కరించిరట.

"అస్తి ద్రోణం అతః పరం" అన్న వాక్యాన్ని నేను అప్పుడప్పుడూ స్మరిస్తూ ఉంటాను. దీక్షితులవారి "అర్క ద్రోణ ప్రభృతి కుసుమై రర్చనంతే విధేయం" అన్న శ్లోక పాదమూ జ్ఞాపకం వస్తుంటుంది. మఠమునకు వచ్చే భక్తులలో కొందరు తుమ్మిపూవును విశేషంగా తెస్తుంటారు. నేను వానిని గ్రహించి ఈశ్వరుడికి అర్పిస్తుంటాను. నాకంటే వీనిని తెచ్చియిచ్చే భక్తులకే అధికమైన పుణ్యం. స్వామికంటే స్వామికర్పించే పూజాద్రవ్యములే అధికమని వేదం చెపుతూంది. నమకంలో ఏకాదశానువాకం పూర్తికాగానే "అయంమే హస్తో భగవా నయంమేభగవత్తరః' అన్న మంత్రం వస్తుంది, **"ఈనా చేయి అన్నదే ఇదే నాకు మోక్షాన్ని సంపాదించి ఇస్తున్నది. భగవత్స్వరూపం కాదు మోక్షాన్నివ్వడం, ఈ చేయియే మోక్షాన్నిస్తున్నది. అందుచే ఈ చేయియే భగవంతుడు. కాదు ఇది భగవంతుని మించినది. ఇది భగవత్తరము. భగవత్పూజచే నాకు మోక్షసుఖాన్ని సంపాదిస్తున్నది. ఈహస్తమే కదా! అందుచే ఇది భగవత్తరము".** అందుచే తుమ్మిపూలను పూజార్థం, గ్రహించేటప్పుడంతా, **"శివాత్పరతరం నాస్తి, అస్తి ద్రోణం అతః పరం"** అన్న ఆళ్వార్వమాట జ్ఞప్తికొస్తుంటుంది.

ఉన్మాదము చేస్తుంది కనుక ఉన్మత్తమని ఉమ్మెత్తకు పేరు వచ్చింది. ఉన్మాదము అంటే పిచ్చి , వెఱ్ఱి. ఉన్మాదములు 06.

1. వాతోన్మాదము, 2. పిత్తోన్మాదము, 3. కఫోన్మాదము, 4. సన్నిపాతోన్మాదము, 5. మానసోన్మాదము, 6. విషోన్మాదము.

ఉన్మాదము చేత హింసిస్తుంది కనుక ధూర్తమని, వాతాది రోగాలను కంపింపచేస్తుంది కాబట్టి ధుత్తూరమని, బంగారము యొక్క పేరు కలది కాబట్టి కనకాహ్వయమని, ఉన్మాదక ద్రవ్యాలలో సాటి లేనిది కాబట్టి మాతులమని, మదింపచేస్తుంది కాబట్టి మదనమని ఉమ్మెత్తకు రకరకాల పేర్లు ఉన్నాయి.

శివునికి ఇష్టమయిన పువ్వులలో ఈ ఉమ్మెత్త ఒకటి .పుత్రుని కోరువాడు ధత్తూర పుష్పములతో పూజించాలి (26 శ్లో).ఎర్రని కాడగల ధత్తూర (ఉమ్మెత్త) పుష్పములతో పూజించినచో శుభములు కలుగుతాయని శివమహాపురాణములో చెప్పారు.

(ఆయుః కామో భవేద్యో వై దూర్వాభిః పూజనం చరేత్ ।
పుత్రకామో భవేద్యో వై ధత్తూరకుసుమైశ్చరేత్ ॥ 26

రక్తదండశ్చ ధత్తూరః పూజనే శుభదఃస్మృతః

శివ మహాపురాణములో రెండవదియగు రుద్ర సంహితలో సృష్ట్యుపాఖ్యానమనే మొదటి ఖండములో శివ పూజా వర్ణనమనే పదునాల్గవ అధ్యాయము)

శివుడు ఉన్మత్త శేఖరుడు. అంటే ఉమ్మెత్త పూవులను తలలో ధరించినవాడని ఒక అర్థం. పిచ్చివాళ్ళలో గొప్పవాడని మరొక అర్థం. పరమశివునికి పిచ్చివాళ్లలా తిరగడమంటే చాలా ఇష్టం.

తుమ్మి, ఉమ్మెత్త, జిల్లేడు ఇలాంటి వెల లేని వస్తువులతో ఆయనను పూజిస్తే ఆ పిచ్చివానికి, ఆ ఉన్మత్త శేఖరునికి చాలాఇష్టం.

ఆ ఉన్మత్త శేఖరుడయిన శివుడంటే అప్పయ్య దీక్షితులవారికి చాలా ఇష్టం . తనకు పిచ్చి ఎక్కినప్పుడు తనలో శివ భక్తి ఉందా లేదా పరీక్షించదలుచుకొని శిష్యులకు ఆవిషయం చెప్పి , తన పిచ్చి మాటలను వ్రాయమని , పిచ్చి తగ్గటానికి కావలసిన మందు కూడా చెప్పి ఉమ్మెత్త పూవు తిని పిచ్చివాడై పోయాడు. ఆ ఉన్మాదావస్థలో ఆయన ఏబది శ్లోకాలు ఆశువుగా చెప్పారట. దీనికే ఆత్మార్పణస్తుతి ఆనీ, ఉన్మత్త పంచశతి అనీ పేర్లు. ఉన్నాయి.

వీటికి తెలుగులో తాత్పర్యాలు, అవసరమైన చోట్ల విశేషాలు శివ స్వామి కరుణతో వివరించబడుచున్నవి.

ఇట్లు

డా. తాడేపల్లి పతంజలి

ఆత్మార్పణస్తుతి

కస్తే బోద్ధుం ప్రభవతి పరం దేవదేవ ప్రభావం
యస్మాదిత్థం వివిధరచనా సృష్టిరేషా బభూవ ।
భక్తిగ్రాహ్యస్త్వమిహ తదపి త్వామహం భక్తిమాత్రాత్
స్తోతుం వ్వాఞ్ఛామ్యతిమహదిదం సాహసం మే సహస్వ ॥

తాత్పర్యము

ఓ పరమశివా ! ఈ వివిధమైన సమస్త సృష్టి నిర్మాణములో వ్యక్తమవుతున్న ప్రమాణాలకు అందని నీ మహిమను వర్ణించటానికి ఎవడికి సాహసం ఉంటుంది? నువ్వు కేవలం సంపూర్ణ భక్తికి మాత్రమే అందేవాడివి. అందువలన భక్తితో నిన్ను పొగడాలని నేను సాహసం చేస్తున్నాను. నన్ను మన్నించు.

క్షిత్యాదీనామవయవవతాం నిశ్చితం జన్మ తావత్
తన్నాస్త్యేవ క్వచన కలితం కర్త్రధిష్ఠానహీనమ్ ।
నాధిష్ఠాతుం ప్రభవతి జడో నాప్యనీశశ్చ భావః
తస్మాదాద్యస్త్వమసి జగతాం నాథ జానే విధాతా ॥

తాత్పర్యము

ఓ పరమశివా ! మిశ్రమైన, అనేకపదార్థములు చేరియున్న ఈ భూమి మొదలైనవి ఒక . ఉత్పత్తి, ఆరంభము, మొదలు తప్పక కలిగి ఉంటాయి. ఆ ఆరంభము నీలాంటి సృష్టికర్త లేకుండా జరుగనే జరుగదు. అధిష్ఠాన రహితముగా అల్లిక ఉండదు. ఆ భూమి మొదలైన వాటి ఉత్పత్తి –ఒక జడము వల్ల, ప్రభువు యొక్క లేమి వల్ల జరగనే జరుగదు. అందువల్ల భూమి మొదలైన వాటి సృష్టికి ఆద్యుడవు నీవు అని, సచేతనుడవని , సృష్టి కర్తవని తెలుసుకొని నేను స్తుతిస్తున్నాను.

విశేషాలు

ఎవరీ కాలభైరవుడు... శివపురాణంలో కాలభైరవ వృత్తాంతం ఉంది. ఓసారి మహర్షులకు ఈశ్వర తత్వాన్ని అర్థం చేసుకోవాలన్న జిజ్ఞాస కలిగింది. ఎవరు

చెబుతారా అని ఆలోచించారు. సృష్టికర్తను మించిన బ్రహ్మజ్ఞాని ఎవరుంటారు? నేరుగా బ్రహ్మ తపస్సు చేసుకుంటున్న మేరు పర్వతానికి వెళ్లారు. బ్రహ్మదేవుడు కూడా ఆ నిగూఢ రహస్యాన్ని తప్పక బోధిస్తానని మాటిచ్చాడు. అంతలోనే...సృష్టికర్త చుట్టూ ఓ మాయాపొరను సృష్టించాడు పరమేశ్వరుడు. దీంతో, మనసులో ఏ మూలనో ఉన్న అహంకారం బయటికొచ్చింది. పిచ్చి మహర్షులూ! పరమతత్వం గురించి చెప్పేదేముంది? నేనే ఆ మహాతత్వాన్ని. స్వయంభువును నేను. విధాతను నేను. సృష్టిస్థితిలయ కారకుడినీ నేను. మీ ప్రశ్నకు జవాబు కూడా నేనే.. అంటూ ప్రగల్భాలు పలికాడు. అక్కడే ఉన్న విష్ణుమూర్తికి ఆ మాటలు వినిపించాయి. మాయకే మాయలు నేర్పగలిగిన విష్ణుమూర్తిని కూడా మాయాపొర కమ్మేసింది. **“కాదుకాదు...నేనే గొప్ప”** అంటూ వాదానికి దిగాడు. ఇద్దరూ కలసి వేదాల దగ్గరికెళ్లారు. వేదాలు పురుషరూపాన్ని ధరించి యదంతస్థాని భూతాని యత్సర్వం ప్రవర్తరే... సకల ప్రాణుల్నీ తనలో లీనం చేసుకున్నవాడైన రుద్రుడే పరమతత్వం అంటూ ఆ వేదపురుషుడు పరమేశ్వరుడిని కొనియాడాడు. ఓంకారం కూడా శివుడే సర్వేశ్వరుడని నిర్ధారించింది. అంతలోనే...దివ్య తేజస్సుతో ముక్కంటి ప్రత్యక్షం అయ్యాడు.

ఆ ఆకారాన్ని చూసి బ్రహ్మ ఐదో తల ఫక్కున నవ్వింది. దీంతో శివుడు ఆగ్రహంతో వూగిపోయాడు. భృకుటి ముడిపడింది. అందులోంచి భయంకరమైన ఆకారంతో ఓ కాలపురుషుడు ఆవిర్భవించాడు. అతడే కాలభైరవుడు. భయంకరంగా ఉంటాడు కాబట్టి భైరవుడన్న పేరొచ్చింది. పాపాల్ని పరిహరించేవాడిగా పాపభక్షు అయ్యాడు. కాలభైరవుడికి కాశీనగరం మీద ఆధిపత్యాన్ని ప్రసాదించాడు మహాదేవుడు. శివుడి ఆదేశాన్ని అనుసరించి ...తన వేలిగోటితో బ్రహ్మ ఐదో తలను తెగ నరికేశాడు కాలభైరవుడు. కానీ, ఆ తల కిందపడిపోకుండా భైరవుడి చేతికి అంటుకుపోయింది. అంతలోనే విష్ణువు చుట్టూ తిరుగుతున్న మాయ కూడా తొలగింది. శివతత్వాన్ని నోరారా మెచ్చుకున్నాడు. దీంతో, నాగభూషణుడు శాంతించి విష్ణుమూర్తిని ఆలింగనం చేసుకున్నాడు. చేతికి అంటుకున్న బ్రహ్మకపాలాన్ని మాత్రం కాలభైరవుడు వదిలించుకోలేకపోయాడు. ముల్లోకాలూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. కాశీనగరంలో కాలుపెట్టగానే, మహాద్భుతం జరిగినట్టు...కపాలం వూడిపడింది. దీంతో కాలభైరవుడు ఆనంద తాండవం చేశాడు. కాశీక్షేత్రంలోని ఆ ప్రాంతమే కపాలమోచన దివ్యతీర్థంగా ప్రసిద్ధమైంది. ఇక్కడ పితృదేవతలకు తర్పణాలు ఇస్తారు. ఈ తీర్థానికి

ఎదురుగా కాలభైరవుడు కొలువుదీరాడు. స్థానికులు లాట్ భైరవ అని పిలుచుకుంటారు. ఈ క్షేత్రంలో మహాభైరవాష్టమిని ఘనంగా జరుపుతారు. కార్తికమాసంలోని కృష్ణపక్ష అష్టమినే...కాలాష్టమిగా, కాలభైరవ జయంతిగా జరుపుకుంటారు. మార్గశిర కృష్ణపక్ష అష్టమిని మహాభైరవాష్టమిగా నిర్వహించుకునే వారూ ఉన్నారు. ఆ రోజు కాలభైరవుడి సన్నిధిలో జాగరణ చేస్తారు.

పరమశివుడి ఆదేశం ప్రకారం...కాలభైరవుడే కాశీ క్షేత్రాధిపతి. ఏ ఆలయానికి వెళ్లినా ముందుగా క్షేత్ర పాలకుడిని సందర్శించుకోవడం ఆచారం. ఇక్కడ అష్టభైరవుల ఆలయాలున్నాయి. విశ్వనాథుడి ఆలయానికి కొద్దిదూరంలో కాలభైరవమూర్తి దర్శనమిస్తాడు. రకరకాల భయాలతో బాధపడేవారు ఇక్కడ రక్షరేకులు కట్టించుకుంటారు. దేవుడికి నైవేద్యంగా మద్యాన్ని సమర్పిచడం ఈ క్షేత్ర ప్రత్యేకత. మణికర్ణికాఘాట్ ప్రాంతంలో కాలభైరవుడిని మశాన్ (శ్మశాన)బాబాగా కొలుస్తారు. ఉజ్జయినిలో వెలసిన కాలభైరవుడు కూడా మహాశక్తిమంతుడని భక్తుల విశ్వాసం. దిల్లీ నగరంలోనూ కాలభైరవ క్షేత్రం ఒకటుంది. అసితాంగ భైరవుడూ, రురు భైరవుడూ, చండ భైరవుడూ, క్రోధ భైరవుడూ, ఉన్మత్త భైరవుడూ, కపాల భైరవుడూ, భీషణ భైరవుడూ, సంహార భైరవుడూ... ఇలా ఎన్నో రూపాల్ని ధరించాడు కాలభైరవుడు. ఒక్కో రూపాన్ని ఉపాసిస్తే, మనలోని ఒక్కో దుర్గుణం తొలగిపోతుందని సాధకులు చెబుతారు.

బాలో, ఉన్మత్త పిశాచవత్ అని నిర్వచించారు అవధూతలని. గురుపుంగవులు పిల్లలలాగ, పిచ్చివాళ్ళలాగ, భయంకరులుగా కనిపిస్తారుట. ఈవిధంగా వాళ్ళు స్వార్థ ప్రయోజనాలకోసమే దరి చేరే కొందరిని దూరంగా వుంచుతారు. వారి లీలలు అనేక రకాలుగా వుంటాయి. సంఘప్రయోజనంకోసం వారు అవతరిస్తే సంఘం వారిని ఆదరించవలసి వుంటుంది.

ఇన్ద్రం మిత్రం వరుణమనిలం పద్మజం విష్ణుమీశం
ప్రాహుస్తే తే పరమశివ తే మాయయా మోహితాస్త్వామ్ ।
ఏతైః స్వార్థం సకలమపి యచ్ఛక్తిలేశే సమాప్తం
స త్వం దేవః శ్రుతిషు విదితః శమ్భురిత్యాదిదేవః ॥

తాత్పర్యము

ఓ పరమశివా !ఇంద్రుడు, సూర్యుడు,వరుణుడు, వాయువు, బ్రహ్మ, విష్ణువు, ఈశుడు- వీరందరూనీ మాయతో కూడినవారు.ఆ మాయకు కారణము కూడా

నువ్వే.నిన్ను వారి పేర్లతో పిల్చుకొంటుంటాము. వేదములందు ఆదిదేవుడవని చెప్పబడిన నీయొక్క మహిమకు సంబంధించిన అంశాలు ఇంద్ర, సూర్య,వరుణ, వాయువులందు ఉన్నాయి.

ఆనన్దాబ్ధేః కమపి చ ఘనీభావమాస్థాయరూపం
శక్త్యా సార్ధం పరమముమయా శాశ్వతం భోగమిచ్ఛన్ ।
అధ్వాతీతే శుచిదివసకృత్కోటిదీప్తే కపర్దిన్
ఆద్యే స్థానే విహరసి సదా సేవ్యమానో గణేశైః ॥

తాత్పర్యము

ఓ పరమశివా ! జడముడి జంగమా !ఊహకు అందని ఒక ఆనంద సముద్రము ఘనీభవించి నీరూపము పొందింది. శక్తియయిన పార్వతీదేవితో కలిసి శాశ్వతముగా ఆనంద స్వరూపునిగా దర్శనమిస్తుంటావు.సృష్టియందు మొదటి స్వరూపమైన ప్రకాశవంతమైన నీ రూపము 1. మంత్రాధ్వము, 2. వర్ణాధ్వము, 3. పదాధ్వము, 4. భువనాధ్వము, 5. తత్త్వాధ్వము, 6. కాలాధ్వము. మొదలగు అధ్వములకు(మార్గములకు) అతీతమైనది. గణేశుడు మొదలైన వారితో నిరంతరము సేవింపబడుచూ మూల స్థానములో ఎప్పుడూ విహరిస్తుంటావు.

త్వం వేదాన్తైః వివిధ మహిమా గీయసే విశ్వనేతః
స్త్వం విప్రాద్యైర్వరద నిఖిలైరిజ్యసే కర్మభిః స్వైః ।
త్వం దృష్టానుశ్రవికవిషయానన్దమాత్రావితృష్ణై-
రన్తర్గ్రన్థిప్రవిలయకృతే చిన్త్యసే యోగివృన్దైః ॥

తాత్పర్యము

ఓ పరమశివా ! వరములను అనుగ్రహించువాడా ! వేదాంతములు (ఉపనిషత్తులు) మహిమాన్వితుడవైన నిన్ను ఎప్పుడూ కీర్తిస్తుంటాయి. విప్రాదుల సకల నిజ కర్మలతో నువ్వు కొలవబడుతున్నావు.విషయానందముల విముఖతకొరకు నిన్ను ప్రార్థిస్తే పోగొడతావని శాస్త్రముల వలన గ్రహించి(అనుశ్రవిక) అనేకమంది యోగులు , బ్రహ్మ జ్ఞానులు తమ ఆత్మగ్రంథి (ఆత్మ అనెడి ముడి)తెగుట కొరకు నిన్ను ప్రార్థిస్తుంటారు. (అనగా జన్మరాహిత్యము కొరకు ప్రార్థిస్తుంటారని భావము)

ధ్యాయన్తస్త్వాం కతిచన భవం దుస్తరం నిస్తరన్తి
త్వత్పాదాబ్జం విధివదితరే నిత్యమారాధయన్తః ।

అన్యే వర్ణాశ్రమవిధిరతాః పాలయన్తస్త్వదాజ్ఞాం
సర్వం హిత్వా భవజలనిధావేష మజ్జామి ఘోరే

ఓ పరమశివా !

కొంతమంది భక్తులు నిన్ను ధ్యానించి తరింపరాని(కష్ట సాధ్యమైన) ఈ సంసార సముద్రమును దాటుతుంటారు. కొంతమంది నీ పాద పద్మములను ఆశ్రయించి శాస్త్ర ప్రకారముగా నీకు పూజలు చేసి తరిస్తుంటారు. మరికొంతమంది తమ తమ వర్ణాశ్రమ ధర్మాలకు అనుగుణంగా నీ అజ్ఞలను(వేద పురాణాదులలో చెప్పబడిన నీ మాటలను) తమ జీవన వ్యవహారంలో పాటించటానికి ప్రయత్నిస్తుంటారు. కాని నేను ఏమి తెలియని వాడిని. పై ముగ్గురి పద్ధతులను విడిచి పెట్టి ఈ భయంకరమైన పుట్టుక చావులు కలిగిన సంసార సముద్రములో మునిగిపోతున్నాను.

ఉత్పద్యాపి స్మరహర మహత్యుత్తమానాం కులేఽస్మిన్
ఆస్వాద్య త్వన్మహిమజలధేరప్యహం శీకరాణూన్ ।
త్వత్పాదార్చావిముఖహృదయశ్చాపలాదిన్ద్రియాణాం
వ్యగ్రస్తుచ్ఛేష్వహహ జననం వ్యర్థయామ్యేష పాపః ॥

ఓ మన్మథుని సంహరించిన పరమశివా ! నేను ఎంతో ఉన్నతమైన వంశములో పుట్టాను. నీ మహిమా సముద్రమునుండి కొన్ని నీటి తుంపరలను ఆస్వాదించాను. కాని–చపలత్వము కలిగిన నా ఇంద్రియాల ప్రభావంతో లౌకిక విషయములందు ఆసక్తితో – నీ పాదములను పూజించుటయందు విముఖత్వము కలిగి ప్రవర్తిస్తున్నాను నా జన్మను వ్యర్థము చేసుకొంటున్న పాపాత్ముడిని నేను.

అర్కద్రోణ ప్రభృతికుసుమై రర్చనంతే విధేయం
ప్రాప్యం తేన స్మరహరఫలం మోక్షసామ్రాజ్యలక్ష్మీః ।
ఏతజ్జానన్నపిశ్మి శివశివ వ్యర్థయన్ కాలమాత్మ
ఆత్మద్రోహీకరణవివశో భూయసాధః పతాని ॥

శివ శివ! నీ దయని ఏమని వర్ణించను? సులభంగా లభించే జిల్లేడుపూలను తుమ్మిపూలను, ఉమ్మెత్త పూలను భక్తుల నుండి గ్రహించి నీ సౌలభ్యమును ప్రకటిస్తూ వారికి మోక్ష సామ్రాజ్యలక్ష్మిని అనుగ్రహిస్తున్నావు. ఆత్మ స్వరూపా! ఇది తెలిసి కూడా పూలతో పూజించకుండా ఆత్మద్రోహినై ఇంద్రియ వివశుడనై కాలాన్ని నేను వ్యర్థం చేస్తున్నాను. పదే పదే దిగజారుతున్నాను.

కిం వా కుర్వే విషమవిషయస్వైరిణా వైరిణాహం
బద్ధః స్వామిన్ వపుషి హృదయగ్రన్థినా సార్ధమస్మిన్ ।
ఉక్ష్ణా దర్పజ్వరభరజుషా సాకమేకత్ర బద్ధః
శ్రామ్యన్వత్సః స్మరహర యుగే ధావతా కిం కరోతు ॥

తాత్పర్యము

ఓ పరమశివా ! నేను ఏమి చేయగలను? నువ్వు నన్ను నా శరీరములోని విషయాల పట్ల ఆసక్తి కలిగిన "స్వభావప్రవృత్తి" అను ఒక శత్రువుకు కట్టేసావు ఆ శత్రువు భయానక ,అపాయకర దారులవెంట పరుగెత్తే స్వభావం కలది. శోషించిన దూడని మదించిన ఆంబోతుతో పాటు కాడిలో కడితే , ఆ బలములేని దూడ ఏమి చేయగలదు?

నాహం రోద్ధుం కరణనిచయం దుర్నయం పారయామి
స్మారం స్మారం జనిపథరుజం నాథ సీదామి భీత్యా ।
కిం వా కుర్వే కిముచితమిహ క్వాద్య గచ్ఛామి హన్త
త్వత్పాదాబ్జప్రపదనమృతే నైవ పశ్యామ్యుపాయమ్ ॥

తాత్పర్యము

ఓ పరమశివా ! ఇంద్రియాల గుంపు చేసే అల్లరి అంతా ఇంతా కాదు. ఆ అల్లరిని అడ్డుకొనే సమర్థత నాకు లేదు చావు పుట్టుకలు అను రోగాన్ని తలుచుకుంటూ తలుచుకుంటూ భయంతో వణికి పోతున్నాను ఏమి చేయాలో, ఏది మంచిదో తెలియటం లేదు. ఎక్కడికి చేరాలి స్వామీ నేను?! దిక్కుతోచటంలేదు.నీ పాదాల శరణము తప్ప నాకు ఇంకే ఉపాయం కనబడటం లేదు.

ఉల్లఙ్ఘ్యాజ్ఞాముడుపతికలాచూడ తే విశ్వవన్ద్య
త్యక్తాచారః పశువదధునా ముక్తలజ్జశ్చరామి ।
ఏవం నానావిధభవతతిప్రాప్తదీర్ఘాపరాధః
క్లేశామ్భోధిం కథమహమృతే త్వత్ప్రసాదాత్తరేయమ్ ॥

తాత్పర్యము

ఓ చంద్రశేఖరా ! ప్రపంచములచే నమస్కారములందు ఓ పరమశివా ! నేను నీ ఆజ్ఞను (భక్తి మార్గమును) వీడాను, పశువులా సిగ్గులేకుండా ఈ లోకములో తిరుగుతున్నాను. ఈ విధంగా నానారకాల పుట్టుకల సమూహము కలిగినవాడిని నేను.

నీ దయ లేకుండా ఈ చావు పుట్టుకల భవసాగరాన్ని దాటలేను. దయచూపించు.

క్షామ్యస్యేవ త్వమిహ కరుణాసాగరః కృత్స్నమాగః
సంసారోత్థం గిరిశ సభయప్రార్థనాదైన్యమాత్రాత్ ।
యద్యప్యేవం ప్రతికలమహం వ్యక్తమాగఃసహస్రం
కుర్వన్ మూకః కథమివ తథా నిస్త్రపః ప్రార్థయేయమ్ ॥

తాత్పర్యము

ఓ గిరిశుడా !(కైలాసమునపర్వతమున శయనించువాడా ! పరమశివా !) నువ్వు దయా సాగరుడివి. నా ప్రార్థనలలో భయము, దైన్యము కలిసి ఉన్నాయి. వాటిని గమనించి ఇప్పటివరకు అనేక జన్మలలోని నా పాపరాశులను క్షమిస్తున్నావు అయినప్పటికీ- నువ్వు క్షమించావని ఇక పాపాలు ఈ జన్మలో చేయ కూడదు కదా! కాని - ఈ జన్మలోనూ పాపాలు ఇంకా చేస్తూ సిగ్గులేకుండా- మూగవాడిలా నీముందు నిలబడ్డాను. మూగవాడినైన నేను - నిన్ను ఎలా ప్రార్థించేది?

సర్వం క్షేప్తుం ప్రభవతి జనః సంసృతిప్రాప్తమాగః
చేతః శ్వాసప్రశమసమయే త్వత్పాదాబ్జే నిధాయ ।
తస్మిన్కాలే యది మమ మనో నాథ దోషత్రయార్తం
ప్రజ్ఞాహీనం పురహర భవేత్ తత్కథం మే ఘటేత ॥

తాత్పర్యము

ఓ శివ దేవా! పుట్టిన ప్రతివాడూ శ్వాస సడలిపోయే సమయంలో అయినా - నీ చరణ పద్మాల మీద మనస్సును నిలిపితే చాలు! సంసారము కారణముగా ఏర్పడిన సమస్త పాపాలు విడిచిపెడతాడు. ఓ త్రిపుర హరా ! నాకొక సందేహం. ఆ శ్వాస వదిలిపోయే సమయంలో నా మనస్సు వాత పిత్త కఫ దోష పీడితమయిందనుకో! బుద్ధిని కోల్పోయిందనుకో. నీ చరణ పద్మాల మీద మనస్సు ఎలా నిలుస్తుంది?

ప్రాణోత్క్రాన్తివ్యతికరదలత్సన్ధిబన్ధే శరీరే
ప్రేమావేశప్రసరదమితాక్రన్దితే బన్ధువర్గే ।
అన్తః ప్రజ్ఞామపి శివ భజన్నన్తరాయైరనన్తైః
ఆవిద్ధోఽహం త్వయి కథమిమామర్పయిష్యామి బుద్ధిమ్ ॥

తాత్పర్యము

ఓ శివా! శరీరములోనుంచి ప్రాణము ఎగిరిపోయే తొట్రుపాటు సమయములో – నా శరీరము సంధి (కలయికల) బంధాలు విడచివేస్తుంది. ఒకపక్క నేను చనిపోతున్నానని నా ఆత్మీయ బంధువర్గము ఏడుస్తుంటుంది. ఇలా అనేక విఘ్నాలతో ఆ సమయములో నేను పీడించబడుతుంటాను. ప్రాణములు పోయే ఆ సమయములో ఎలా నేను నీకు నా బుద్ధిని అర్పించగలను?

అద్యైవ త్వత్పదనలినయోరర్పయామ్యన్తరాత్మన్
ఆత్మానం మే సహ పరికరైరద్రికన్యాధినాథ ।
నాహం బోద్ధుం శివ తవ పదం న క్రియా యోగచర్యాః
కర్తుం శక్నోమ్యనితరగతిః కేవలం త్వాం ప్రపద్యే ॥

తాత్పర్యము

ఓ పార్వతీపతీ !ఓ అంతరాత్మా ! నా పరికరాలతో (ఇంద్రియాలతో) సహ ఈ రోజే నన్ను నీ పాద పద్మాలకు అర్పిస్తున్నాను.ఓ శివా ! నీ సన్నిధి నాకు తెలియదు. అక్కడికి ఎలా చేరాలో , ఆ యోగ పద్ధతులేమిటో నాకు తెలియదు. గత్యంతరము లేదు.కేవలము నిన్నే శరణు వేడుతున్నాను.

విశేషాలు

ఇంద్రియాలు – ఇంద్రియాలు మూడు విధాలు.

కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, అంతరింద్రి యాలు.

వాక్కు, పాణి, పాదం, పాయువు (మల ద్వారం), ఉపస్థం అనేవి కర్మేంద్రి యాలు. త్వక్కు (చర్మం), చక్షువు, శ్రోత్రము, జిహ్వా, ఘ్రాణం అనేవి జ్ఞానేంద్రియాలు.

జ్ఞాతృ, మనో, బుద్ధి, చిత్త, ఆహంకారాలు అంత రింద్రియాలు యోగములు 1. అష్టాంగయోగము, 2. కర్మయోగము, 3. భక్తియోగము, 4. జ్ఞానయోగము..

యః స్రష్టారం నిఖిలజగతాం నిర్మమే పూర్వమీశః
తస్మై వేదానదిత సకలాన్ యశ్చ సాకం పురాణైః ।
తం త్వామాద్యం గురుమహమసావాత్మబుద్ధిప్రకాశం
సంసారార్తః శరణమధునా పార్వతీశం ప్రపద్యే ॥

తాత్పర్యము

ఈ సకల ప్రపంచాన్ని సృష్టించిన వాడు బ్రహ్మ. ఆ బ్రహ్మను సృష్టించినవాడు శివుడు. బ్రహ్మదేవునికి పురాణాలు, వేదాలు శివుడు బోధించాడు. బుద్ధిని ప్రకాశింపచేసే ఆదిగురువు పరమశివుడు. చావు పుట్టుకలు గల సంసారములో దుఃఖము పొందుతున్న నేను ఆ పరమశివుని శరణు పొందుతున్నాను.

బ్రహ్మాదీన్ యః స్మరహర పశూన్మోహపాశేన బద్ధ్వా
సర్వానేకశ్చిదచిదధికః కారయిత్వాఽఽత్మకృత్యమ్ ।
యశ్చైతేషు స్వపదశరణాన్విద్యయా మోచయిత్వా
సాన్ద్రానన్దం గమయతి పరంధామ తం త్వాం ప్రపద్యే ॥

తాత్పర్యము

ఓ మన్మథ నాశకా ! ఓ పరమశివా ! బ్రహ్మ మొదలయిన వారిని కూడా నువ్వు మోహము అనే పాశముతో బంధిస్తున్నావు నీ కార్య సమూహము వారిచే చేయించుకొంటున్నావు. నువ్వు చిదచిత్తుకు అందనివాడివి (చిత్ అనగా జీవులు. అచిత్ అనగా నది, కొండ మొదలగు జడములగు స్థావరములు.) నీ శరణు కోరిన వారందరికి దట్టమయిన ఆనందాన్ని ఇచ్చే నివాసానికి చేర్చుతావు. నిన్ను శరణు వేడుతున్నాను.

భక్తాగ్ర్యాణాం కథమపి పరైర్యోఽచికిత్స్యామమర్త్యైః
సంసారాఖ్యాం శమయతి రుజం స్వాత్మబోధౌషధేన ।
తం సర్వాధీశ్వర భవమహాదీర్ఘతీవ్రామయేన
క్లిష్టోఽహం త్వాం వరద శరణం యామి సంసారవైద్యమ్ ॥

తాత్పర్యము

ఓ సర్వేశ్వరా ! ఓ పరమశివా ! ఈ సంసారమనే రోగాన్ని దేవతలెవ్వరూ తొలగించలేరు. ఆత్మబోధ (ఆధ్యాత్మిక విద్య) అనే మందుతో – తారక మంత్రోపదేశముతో నువ్వొక్కడివే ఆ రోగాన్ని తొలగించగలవు. నా పుట్టుక చావులనెడి సంసార రోగము అనేక జన్మలనుండి వస్తూ, బహు దీర్ఘమయినది– ఈ రోగ విముక్తికి సంసార వైద్యుడివైన నిన్ను శరణు కోరుతున్నాను.

ధ్యాతో యత్నాద్విజితకరణైర్యోగిభిర్యో విమృగ్యః
తేభ్యః ప్రాణోత్క్రమణసమయే సన్నిధాయాత్మనైవ ।
తద్వ్యాచష్టే భవభయహరం తారకం బ్రహ్మ దేవః
తం సేవేఽహం గిరిశ సతతం బ్రహ్మవిద్యాగురుం త్వామ్

ఓ గిరిశుడా !(క్రైలాసమునందు శయనించువాడు గిరిశుడు. కైలాసమునకు ఈశ్వరుడు గిరీశుడు) పరమశివా !నువ్వు బ్రహ్మ విద్యకు (బ్రహ్మమును తెలిసికొను విద్య, ఆధ్యాత్మవిద్య.) గురువువి. ఇంద్రియాలను నిగ్రహించి నీకొరకు వెదికే యోగులు తమ ప్రాణాలను విడిచే సమయములో వారికి బ్రహ్మోపదేశంచేస్తావు. (బ్రహ్మ విద్యను బోధిస్తావు) ఆ బ్రహ్మ విద్య పుట్టుక చావుల భయము కలిగిన ఈ సంసారచక్రమునుండి ఉద్ధరిస్తుంది. బ్రహ్మ విద్యకు గురువయిన నిన్ను ఎప్పుడూ సేవిస్తాను.

విశేషాలు

32 బ్రహ్మవిద్యలు

1. ఉద్గీథోపాసనావిద్య, 2. సామోపాసనావిద్య, 3. సంప్రత్తి విద్య, 4. కోశవిద్య, 5. మధువిద్య, 6. గాయత్రీవిద్య, 7. బ్రహ్మలోకద్వారపాలకోపాసనా విద్య, 8. కౌక్షేయ జ్యోతిర్విద్య, 9. శాండిల్యవిద్య, 10. మన ఆకాశయోస్సమస్త బ్రహ్మవిద్య, 11. ఆదిత్యబ్రహ్మ విద్య, 12. సంవర్గవిద్య, 13. షోడశకళ బ్రహ్మవిద్య, 14. ఉపకోసలవిద్య, 15. అక్షిపురుష విద్య, 16. ప్రాణవిద్య, 17. పంచాగ్నివిద్య, 18. వైశ్వానర విద్య, 19. దహరవిద్య, 20. సంప్రదాయ నామాక్షరవిద్య, 21. ప్రజాపతి ప్రత్యగాత్మ విద్య, 22. భూమవిద్య, 23. సత్యవిద్య, 24. చతుష్పాద్గాయత్రీవిద్య, 25. సువర్ణ విద్య, 26. ఓంకారవిద్య, 27. అహంగ్రహణవిద్య, 28. సంపాదికాగ్నివిద్య, 29. న్యాసవిద్య, 30. పురుషవిద్య, 31. షోడశ కళ చంద్రవిద్య, 32. క్రియాత్మక ప్రాజాపత్య విద్య. %జ%సంఖ్యార్థనామప్రకాశిక 198 పు.%

దాసోఽస్మీతి త్వయి శివ మయా నిత్యసిద్ధం నివేద్యం
జానాస్యేతత్ త్వమపి యదహం నిర్గతిః సంభ్రమామి ।
నాస్త్యేవాన్యన్మమ కిమపి తే నాథ విజ్ఞాపనీయం
కారుణ్యాన్మే శరణవరణం దీనవృత్తేర్గృహాణ ॥

తాత్పర్యము

ఓ శివా ! నేను నీకు సంబంధించిన నిత్య సిద్ధ దాసుడిని.(ఎప్పుడూ నీ సేవకుడిని) అని నివేదిస్తున్నాను. నాకు గమ్యము లేదు. నేను ఊరికే అటు ఇటూ తిరుగుతున్నాను. ఈ విషయం నీకు తెలుసు. దీనుడిని. శరణు కోరుతున్నాను.

బ్రహ్మోపేన్ద్రప్రభృతిభిరపి స్వేప్సితప్రార్థనాయ
స్వామిన్నగ్రే చిరమవసరస్తోషయద్భిః ప్రతీక్ష్యః ।
ద్రాగేవ త్వాం యదిహ శరణం ప్రార్థయే కీటకల్పః
తద్విశ్వాధీశ్వర తవ కృపామేవ విశ్వస్య దీనే ॥

కర్మజ్ఞానప్రచయమఖిలం దుష్కరం నాథ పశ్యన్
పాపాసక్తం హృదయమపి చాపారయన్సన్నిరోద్ధుమ్ ।
సంసారాఖ్యే పురహర మహత్యన్ధకూపే విషీదన్
హస్తాలమ్బప్రపతనమిదం ప్రాప్య తే నిర్భయోస్మి ॥

తాత్పర్యము

ఓ పురహర !(మయునిచే నిర్మింపబడిన మూడు పురములను హరించినవాడా! ప్రభూ! కర్మ జ్ఞానములతో సమస్తము ఉన్నదంటారు. ఆ సమస్తాన్ని దాటటం నావల్ల కాదు. శక్తి లేని నేను వాటివైపు దీనంగా చూస్తున్నాను. ఈ హృదయము పాపకర్మలు చేయుటలో విపరీతమైన ఆసక్తి కలిగియుంది. ఈ హృదయాన్ని పాపకర్మలు చేయద్దని చెప్పి ఆపలేకపోతున్నాను. కారు చీకట్లు కమ్మిన సంసారపు నూతిలో పడి దుఃఖిస్తున్నాను. అయినా నీదోసిటిలో ఉన్నానులే అని నిర్భయంగా బతుకుతున్నాను. (నీయందు భక్తి కలిగి ఉండుట వలన నాకు నిర్భయత్వమని భావం)

త్వామేవైకం హతజనిపథే పాన్థమస్మిన్ప్రపఞ్చ
మత్వా జన్మప్రచయజలధేః బిభ్యతః పారశూన్యాత్ ।
యత్తే ధన్యాః సురవర ముఖం దక్షిణం సంశ్రయన్తి
క్లిష్టం ఘోరే చిరమిహ భవే తేన మాం పాహి నిత్యమ్ ॥

తాత్పర్యము

దేవతలలో శ్రేష్ఠుడా! ఓ పరమశివా! ఈ జన్మపరంపర అనేది ఒక సముద్రం. దీనికి అవతలి ఒడ్డు కనబడదు. ఇలా భయపడుతున్నవారందరూ దక్షిణామూర్తివైన నిన్ను ఆశ్రయించాలి. నిన్ను ఆశ్రయించినవారే ధన్యులు. (వారే మోక్షము పొందుతారు) భయంకరమైన సంసారమను కష్టములో ఉన్న నన్ను ఎప్పుడు కాపాడుము.

విశేషాలు

శిష్యులకు ఇతర గురువులు మాటలతో సందేహాలు తీరుస్తారు. కానీ దక్షిణామూర్తి

రూపంలోని పరమశివుడు మౌనం గానే శిష్యులకు కలిగే సందేహాలు పోగొడతాడు.

ఏకో?సి త్వం శివ జనిమతామీశ్వరో బన్ధముక్త్యోః
క్లేశ్గారావలిషు లుఠతః కా గతిస్త్వాం వినా మే ।
తస్మాదస్మిన్నిహ పశుపతే ఘోరజన్మప్రవాహే
ఖిన్నం దైన్యాకరమతిభయం మాం భజస్వ ప్రపన్నమ్ ॥

ఓ పశుపతీ !పరమశివా ! జీవులమైన మాకు బంధాలను, మోక్షాలను ప్రసాదించే ఈశ్వరుడివి నువ్వొక్కడివే. సంసారమనే అగ్ని గుండంలో నేను పొర్లుతున్నాను నిన్ను మించిన ఆశ్రయము ఇంకొకటి లేదు. ఓ ఈశ్వరా ! నేను నిన్ను శరణు కోరుతున్నాను. ఈ ఘోరమైన జన్మ చక్రము నుంచి నన్ను ఆదుకోవయ్యా ! నమస్సులు.

యో దేవానాం ప్రథమమశుభద్రావకో భక్తిభాజాం
పూర్వం విశ్వాధిక శతధృతిం జాయమానం మహర్షిః ।
దృష్ట్వాపశ్యత్సకలజగతీసృష్టిసామర్థ్యదాత్ర్యో
స త్వం గ్రన్థిప్రవిలయకృతే విద్యయా యోజయాస్మాన్ ॥

ఓ శివా ! భక్తితో నిన్ను సేవించువారి అశుభములను పోగొట్టు దేవతలలో నువ్వే మొదటివాడివి. నువ్వే నేర్పరివి. పూర్వము సర్వోన్నతుడైన శతధృతి అను కన్యను వివాహము చేసుకొన్నప్రాచీన బర్హి అను మహర్షిని, వారి కుమారులను కరుణించావు. వారికి సకల సృష్టిని చేసే సామర్థ్యాన్ని అనుగ్రహించావు. ఆ జ్ఞానాన్ని మాకు కూడా అనుగ్రహించు. మా భవబంధాలను విడిపించు.

విశేషాలు

భాగవతములో శతధృతి వృత్తాంతము ఇలా ఉంది. అట్టి సౌందర్యఖనియు సముద్రపుత్రియు నయిన శతధృతి యను కన్యం బ్రహ్మోదేశంబునం బాణిగ్రహణంబు చేసె నా శతధృతి వలనం బ్రాచీనబర్హికిఁ బదుగురు కొడుకులు జనియించిరి వారలు తుల్యనామ వ్రతులును ధర్మపారగులును నయిన ప్రచేతసులు వారు ప్రజాసర్గంబు నందుఁ దండ్రిచేత నాజ్ఞాపితులయి తపంబు గావింప వనంబునకుం జను సమయంబునం దన్మార్గంబునఁ బ్రసన్నుం డగుచు దృశ్యమానుండైన రుద్రునిచేత నేది యుపదేశింపబడె దాని జపధ్యాన పూజా నియమంబుల సేవించుచుఁ దపఃపతి యైన నారాయణుం బదివేల దివ్యవత్సరంబులు పూజించి” రని చెప్పిన విని విదురుండు మైత్రేయున కిట్లనియె. (అటువంటి సౌందర్యమునకుగనివంటి సముద్రుని పుత్రిక

అయిన శతధృతి +నూరు యజ్ఞములుఅనెడ్మి) కన్యను బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారము ప్రాచీనబర్హి వివాహము చేసుకొన్నాడు. ఆ శతధృతి వలన ప్రాచీనబర్హికి పదిమంది పుత్రులుపుట్టారు.వారలు తండ్రి ఆజ్ఞ పొంది తపస్సుచేయుటకు అడవికివెళ్ళిన సమయములో దారిలో శివునివలన ఉపదేశము పొందారు. పోతన భాగవతము 4-684-వ). అని భాగవతములో శతధృతిని ఒక కన్యగ పేర్కొన్నారు.

శతధృతి

బ్రహ్మాండచ్ఛత్రదణ్డః శతధృతిభవనాంభోరుహోనాళదణ్డః
క్షోణీనౌకూపదణ్డః క్షరదమరసరిత్పట్టికాకేతుదణ్డః ।
జ్యోతిశ్చక్రాక్షదణ్డస్త్రిభువనవిజయస్థమ్భదణ్డోంఘ్రిదణ్డః
శ్రేయస్త్రైవిక్రమస్తే వితరతు విబుధద్వేషిణాం కాలదణ్డః ॥

బ్రహ్మాండము అను గొడుగుకు మూలమైన కర్ర, బ్రహ్మ పీఠమైన తామరపువ్వు యొక్క నాళము భూమి అను నావయొక్క తెరచాప కొయ్య జారుచున్నఅమరవాహిని అయిన గంగ (అనెడి) పట్టుచీరకు జెండాకర్ర జ్యోతిశ్చక్రమునకు ఇరుసు,బుద్ధిమంతులశత్రువులకు (రక్కసులకు) కాలదండమూ ఐనట్టి త్రివిక్రమావతారుడైన హరి యొక్క త్రిభువన విజయసంకేతముగా ఒప్పారిన స్థంభముగా భాసించు పాదము అను ధ్వజము నీకు అభివృద్ధి పంచుగాక!) అని అని దశకుమారచరిత్రలో శతధృతి పదాన్ని బ్రహ్మ అను అర్థంలో ప్రయోగించారు.

స్తంభిత శత ధృతి హృదయం
జృంభిత మతివేల మబ్ధి సలిలమివ ।
రంజిత భువన మవైక్షిషి
కాం జితరతియౌవం నగిరాందేవ్యాః ॥

(ఓ తల్లీ! నీరూపం నిత్యయౌవనభరితం.అది రతీదేవి సౌందర్యాన్ని మించింది. బ్రహ్మదేవుని హృదయాన్ని అనందాతిశయంతో స్తంభింపజేసింది. కడలికెరటంవలె ఉప్పొంగిన అందం నీది.నీరూపం జగన్మోహనకరం.) అని అభినవ కాళిదాసు బిరుదాంకితులు తెలకపల్లి రామచంద్ర శాస్త్రి గారు శ్రీ శారదాస్తుతి శతకంలో శతధృతి పదాన్ని బ్రహ్మ అను అర్థంలో ప్రయోగించారు.

యద్యాకాశం శుభద మనుజాశ్చర్మవద్వేష్టయేయుః
దుఃఖస్యాన్తం తదపి పురుషస్త్వామవిజ్ఞాయ నైతి ।
విజ్ఞానం చ త్వయి శివ ఋతే త్వత్ప్రసాదాన్న లభ్యం
తద్దుఃఖార్తః కమిహ శరణం యామి దేవం త్వదన్యమ్ ॥

శుభమును కలుగచేసే శివా ! మనుష్యులు ఆకాశాన్ని చర్మంలా కప్పుకొన్నప్పటికీ (అంటే ఆకాశంలా విస్తృతమైన ఎన్నో శాస్త్రాలు చదివినప్పటికీ) నిన్ను తెలుసుకోకుండా– ఏ ఒక్కడు దుఃఖాల చివరను అందుకోలేడు.(దుఃఖాలు పోగొట్టుకోలేడని భావం) నీ దయ లేకుండా నిన్ను తెలుసుకోలేం. అది అసాధ్యం.కనుక నన్ను మన్నించు స్వామీ !నిన్ను తెలుసుకొనేటట్లు నువ్వే చేయి. నిన్ను తప్పించి ఇంకా ఎవరిని శరణు పొందమంటావు?! నువ్వే దిక్కు. నన్ను రక్షించు.

కిం గూఢార్థైరకృతకవచోగుంభనైః కిం పురాణైః
తన్త్రాద్యైర్వా పురుషమతిభిర్దుర్నిరూప్యైకమత్యైః ।
కిం వా శాస్త్రైరఫలకలహోల్లాసమాత్రప్రధానైః
విద్యా విద్యేశ్వర కృతధియాం కేవలం త్వత్ప్రసాదాత్ ॥

తాత్పర్యము

సమస్తమైన విద్యలను సామంతులచే సేవింపబడు చక్రవర్తీ ! ఓ శివా ! (విద్యేశ్వర) వేదాలు, పురాణాలు , తంత్రాలు, ఆగమాలు రహస్యమైన అర్థాలు కలిగినవి. మానవుల బుద్ధికి సులభముగా తెలియబడనివి. తమ స్వభావానికి తగిన మాటల కూర్పు కలిగినవి. ఇక శాస్త్రాలు ప్రధానంగా వాదనలవల్ల కలిగే పనికిరాని ఆనందాన్ని మాత్రమే ఇస్తాయి.ఆత్మ జ్ఞానము కావాలనుకొంటున్న నాకు వీటి వల్ల ప్రయోజనము లేదు.ఓ శివా !నిజమైన ఆత్మ విద్య కేవలం నీ అనుగ్రహముచేతనే లభిస్తుంది.

విశేషాలు

విద్య అనగా

1. దువు
2. జ్ఞానము.
3. చతుర్విద్యలు.

ఆన్వీక్షకి (ఇందు విజ్ఞానము తెలుపబడును),

త్రయి (ఇందు ధర్మాధర్మములు తెలుపబడును),
వార్త (ఇందు అర్థానర్థములు తెలుపబడును),
దండనీతి (ఇందు నయానయములు తెలుపబడును).

షడ్విద్యలు.

ఆకర్షణము, స్తంభనము, మారణము, విద్వేషణము, ఉచ్చాటనము, మోహనము.

చతుర్దశ విద్యలు.

చతుర్వేదములు, షడంగములు, మీమాంస, న్యాయశాస్త్రము, పురాణములు, ధర్మశాస్త్రము.

అష్టాదశవిద్యలు.

చతుర్దశవిద్యలు, ఆయుర్వేదము, ధనుర్వేదము, నీతిశాస్త్రము, అర్థశాస్త్రము.

వేదములు

ఋగ్యజుస్సామాధర్వణము అని నాలుగు భేదములు
ఆనాలుగును బ్రహ్మకాండము, కర్మకాండము అని రెండుభాగములు.
అందు బ్రహ్మకాండము సాక్షాత్తుగ బ్రహ్మము యొక్క స్వరూపమును ప్రతిపాదిస్తుంది.
అదియే ఉపనిషత్తులు.
కర్మకాండము వర్ణాశ్రమోచిత కర్మములు లోనగువానిని వివరిస్తుంది.
ఋగ్వేదము ఎక్కువగా మంత్రభాగము .
యజుర్వేదము విశేషించి విధులయొక్క రీతులను చెబుతుంది.
సామము స్తోత్రరూపము
అధర్వణము శాంత్యాదులను గుఱించి చెబుతుంది.
ఆగమములు
ఈశ్వరప్రోక్తములు అయి విశేష ధర్మములను చెప్పునట్టి శాస్త్రములను ఆగమములు అంటారు.
అవి శైవాగమములు, వైష్ణవాగమములు అని రెండువిధములు
ముఖ్యముగా దేవాలయాది ప్రతిష్ఠలును దేవార్చనాది క్రమములును ఆగమములలో ఉన్నాయి.

శైవాగమము "పాశుపతము" అని, వైష్ణవాగమములు "పాంచరాత్రము", "వైఖానసము" అని పిలుస్తారు

సోమకాసురుడు వేదాలనును సముద్రములోనికి ఎత్తికొని పోయిన సమయములో విష్ణువు తన పూజకొరకు పూజావిధానాన్ని శాండిల్యఋషికి అయిదు రాత్రులలో ఉపదేశము చేసాడు కనుక ఆగమములకు పాంచరాత్రము అను పేరు వచ్చింది.

శైవాగమములో , శివుఁడు (పశుపతి) లోకులు తన్ను పూజచేసే విధమును పార్వతికి చెప్పినట్లు ఉంది.

తంత్రములు

శత్రువు చేసే దుష్ట శక్తుల ప్రయోగాలకు విరుగుడుగా చేసేది తంత్ర విద్య. ఇందులో కొంత జీవ హింస కూడా ఉన్నదంటారు

తంత్రగ్రంధములు

Apocryphal books teaching a secret code of worship, prescribing the adoration of demons and women with magical rites, with the use of flesh and wine, and extraordinary lewdness.

శాస్త్రము.

గమనించిన విషయములను క్రోడీకరించి విషయతత్వ నిర్ణయముచేసి సూత్రముల నిర్మించి ధర్మములను చెప్పునది

శాస్త్రములు రకరకాలు

తర్కశాస్త్రము the science of Logic.

వ్యాకరణశాస్త్రము the science of grammar.

వైద్యశాస్త్రము the science of medicine.

జ్యోతిశ్శాస్త్రము the science of Astronomy

వేదాంతశాస్త్రము the science of Theology.

ధర్మశాస్త్రము the science of law, a system, or code of ordinancces, a code of laws, jurisprudence.

శిల్పిశాస్త్రము the science of Architechture.

అలంకారశాస్త్రము Rhetoric

సూపశాస్త్రము the science of cookery.
నీతి శాస్త్రము the science of morals.
గణితశాస్త్రము the science of Arithmetic.
దోహదశాస్త్రము the science of Agriculture.
యోగశాస్త్రము the Yoga Philosophy.
ఆయుధశాస్త్రము the science of war, or weapons.

పాపిష్ఠోఽహం విషయచపలః సన్తతద్రోహశాలీ
కార్పణ్యైకస్థిరనివసతిః పుణ్యగన్ధానభిజ్ఞః ।
యద్యప్యేవం తదపి శరణం త్వత్పదాబ్జం ప్రపన్నం
నైనం దీనం స్మరహర తవోపేక్షితుం నాథ యుక్తమ్ ॥

తాత్పర్యము

మన్మథుని సంహరించిన ఓ పరమశివా !(స్మరహర) నేను పాపము చేసినవాడిని (పాపిష్ఠో?హం) రూపము, రసము, గంధము, స్పర్శము, శబ్దము. అను ఇంద్రియ విషయములందు ఆసక్తి కలిగినవాడిని.(విషయ చపలః) ఎప్పుడూ ఇతరులకు కీడు చేయాలనే ఆసక్తి కలిగినవాడిని(సన్తత ద్రోహశాలీ) ఎప్పుడూ సంకుచితత్వము నాలో స్థిర నివాసముగా కలిగినవాడిని(కార్పణ్యైకస్థిరనివసతిః) పుణ్యపు వాసన తెలియని వాడిని (పుణ్యగన్ధానభిజ్ఞః) అయినప్పటికీ దైన్యముతో నీ పాద పద్మాలను ఆశ్రయించాను కాబట్టి ,నువ్వు నన్ను కాదనకుండా ఉండటానికి, రక్షించకుండా ఉండటానికి వీలులేదు.

విశేషాలు

1.పాపాలు పాపాలు జైనుల దృష్టిలో మొత్తం 18 : 1.హింస (ప్రణతిపాత్). 2. ఝూట్ (అబద్ధాలు చెప్పడం). 3. చోరి (దొంగతనం). 4. మేథున్ (వ్యభిచారం). 5. పరిగ్రహ (సంపదను దురాశతో పెంచుకోవడం). 6. క్రోధం. 7. మానం (పొగరు/దురహంకారం). 8. మాయ (వంచన/ భ్రాంతి/ భ్రమ). 9. లోభం (అత్యాశ). 10. రాగ (వ్యామోహం). 11. ఈర్ష్య. 12. కలహం (గొడవ పడటం). 13. అభ్యఖ్యయనం (దోషారోపణ). 14. పైశున్యం (ఉబుసుపోక మాటలు). 15. రతి-అరతి (ఇష్టాయిష్టాలు). 16. పర-పరివాదం (ఆక్షేపించడం/ విమర్శించడం). 17. మాయా-మృషావాదం. (స్వార్థదృష్టితో తప్పుడు వాదం చేయడం.) 18. మిథ్యత్వం (తప్పు నమ్మకాలు).

2.పాపోహం, పాపకర్మాహం, పాపాత్మ పాపసంభవ: త్రాహిమాం కృపయాదేవ శరణాగత వత్సల, అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణంమమ. నేను పాపిని, పాపపు క్రియలు చేయుచున్నాను. పాపపు ఆత్మ గలవాడను, పాపమందు జన్మించితిని. నన్ను రక్షించు

3.మనలో పరమాత్మ ప్రతిబింబించేంతవరకు, మనము జీవన్ముక్తులమయ్యేవరకు, మనలో పాపాలున్నట్లే. ఎన్నిరోజులు ప్రార్ధించినా మనలో జీవన్ముక్తి ఉదయించలేదంటే ఎంత పాపముండాలి? ఐతే దానిని గుర్తించేదెలా? గుర్తించనిదే ఆ శ్లోకం చదువుకొనడమెలా సార్ధకమవుతుంది? కనుక ఈ శ్లోకం మనను యివన్నీ చేయమని ఉద్బోధిస్తుంది.

4.పాపమంతటికీ మూలం అజ్ఞానం. దానినుండి అహంకార మమకారాలు, రాగద్వేషాలు, కామ,క్రోధ,లోభ,మోహ,మద,మాత్సర్యాలు, వాటివలన అపారమైన పాపరాశీ ఉద్భవిస్తాయి. వాటన్నిటికీ మూలమైన అజ్ఞానం తొలిగేవరకు, మర్రివిత్తనంలో మర్రిచెట్టు దాగియున్నట్లు పాపానికి బీజాలైన సంస్కారాలన్నీ మనలో దాగి వుంటాయి.

5.వాటిని ప్రేరేపించే సందర్భాలు రాగానే అవి విజృంభిస్తూనే వుంటాయి. అజ్ఞానం తొలిగి, ఆత్మసాక్షాత్కారమయ్యేవరకు యీ ప్రమాదముంటుందనటానికి మన పురాణాలలోని విశ్వామిత్రుని వృత్తాంతమే ఉదాహరణ.

6.భగవంతుడు సాక్షాత్కరించినా యిది వెంటనే తొలిగిపోక, మనను నశింపజేసే అవకాశముంటుందని రాక్షసుల వృత్తాంతాలు హెచ్చరిస్తాయి. ఈశ్వరుడు ప్రత్యక్షమైనా భస్మాసురుడికి మాత్రం “నేనేవరి నెత్తిన చేయిపెడితే వారు భస్మమైపోవాలి” అని వరం కోరే బుద్ధి తొలగలేదట!

7.ఇదంతా చదివిగూడ ఈ శ్లోకం (పాపోహం పాపకర్మణా..) ఎంత ముఖ్యమైన హెచ్చరికో తెలుసుకోలేకుంటే మనలో పాపం ఎంత దట్టంగా అలుముకొన్నదో తెలియడంలేదు? అదెంత టక్కరీ, మోసగత్తో అర్ధం కావడంలేదూ? (ఆచార్య భరద్వాజ)

8.యాని కాని చ పాపాని జన్మాంతరకృతాని చ తాని తాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదే పదే ప్రదక్షిణ అనగా నేను అన్నివైపుల నుండి నిన్నే కాంచుతూ నిన్నే అనుసరిస్తూ ధ్యానిస్తున్నానని అర్ధం. 'ప్ర' అనగా పాపాల నాశనమని, 'ద' అనగా కోరికలు

తీర్చమని, 'క్షి' అనగా మరు జన్మలో మంచి జన్మ ఇవ్వమని, 'ణ' అంటే అజ్ఞానం పారద్రోలి ఆత్మజ్ఞానమును ఇవ్వమనే అర్ధమును కొందరు చెబుతారు. (చాగంటివారు)

9. పుణ్యకర్మలు మొత్తం 10 1. పరోపకారము, 2. గురుజనసేవ, 3. దానము, 4. ఆతిథ్యము, 5. పావిత్ర్యము, 6. మహోత్సవము, 7. వ్రతము, 8. పశుపాలనము, 9. జగద్వృద్ధి, 10. న్యాయాచరణము.

ఆలోచ్యైవం యది మయి భవాన్ నాథ దోషాననన్తాన్
అస్మత్పాదాశ్రయణపదవీం నారతీతి క్షిపేన్మామ్ ।
అద్యైవేమం శరణవిరహోద్విద్ధి భీత్యైవ నష్టం
గ్రామో గృహ్ణాత్యహితతనయం కిం ను మాత్రా నిరస్తమ్ ॥

తాత్పర్యము

ఓ పరమశివా ! నేను అనేక దోషాలు చేసాను. అది ఆలోచించి వీడు నాపాదాలు అశ్రయించటానికి పనికిరాడని నువ్వు దూరంగా విసిరి వేస్తావా? అప్పుడు ఎవరి శరణము లభించదనే భయముతో ఇప్పుడే నశిస్తాను. తల్లి మేలు చేయని కుమారుని- తల్లి విడిచిపెట్టిన కుమారుని- ఊరు ఆదరిస్తుందా? నువ్వు తల్లి లాంటి వాడివయ్యా నువ్వు కాదంటే ఎలా స్వామీ !

విశేషాలు

దోషములు (తప్పులు) రకరకాలుగా పెద్దలు చెప్పారు. వాటిలో కొన్నిటిని వివరిస్తాను.

ద్వివిధ-దోషములు : (చిత్త దోషములు) 1. రజస్సు, 2. తమస్సు. "రజస్తమశ్చ మనసో ద్వౌ దోషౌ సముదీరితౌ" త్రి-దోషములు 1. పరద్రవ్యాపహరణము, 2. పరదారాభిలాష, 3. మిత్రులయందు అవిశ్వాసము.

పరస్వానాం చ హరణం పరదారాభిమర్షణమ్,
సుహృదామతిశంకా చ త్రయో దోషా క్షయావహాః
వాల్మీకి రా. 6-87-24

1. అతివ్యాప్తి (లక్షణము లక్ష్యములు కాని వాని యందుండుట), 2. అవ్యాప్తి (లక్షణము లక్ష్యములోనే కొన్నిటియందుండక పోవుట), 3. అసంభవము (లక్షణము లక్ష్యములలో నొక్కదానియందును ఉండకపోవుట).

నవదోషములు

1. కామము, 2. క్రోధము, 3. భయము, 4. లోభము, 5. దైన్యము, 6. దర్పము, 7. లజ్జ, 8. అభిమానము %జ%ఇవి బుద్ధి దోషములు%.

దశదోషములు

1. ఉన్మత్తత, 2. వృత్తిహీనత, 3. అపస్మార దోషము, 4. దూరస్థత, 5. కుష్ఠరోగము, 6. మూర్ఖత, 7. మోక్షమార్గ ప్రయత్నము, 8. శూరత, 9. విద్య రాకుండుట, 10. నిర్వృత్తత %జ%ఇవి వరునికి సంబంధించిన దోషములు%.

అష్టాదశ-దోషములు :

1. లోకద్వేషము, 2. ప్రాతికూల్యము, 3. అభ్యసూయ, 4. అసత్యవాక్కు 5. కామము, 6. క్రోధము, 7. పారతంత్ర్యము, 8. పరివాదము, 9. పిశునత, 10. అర్థహాని, 11. వివాదము, 12. మాత్సర్యము, 13. ప్రాణిపీడనము, 14. ఈర్ష్య, 15. మోదము, 16. అతివాదము, 17. సంజ్ఞానాశము, 18. అభ్యసూయత %జ%ఇవి మదమువలన కలుగు దోషములు

మహాభారతము 5-45-9

ఈ దోషాల్లో ఏదో ఒకదోషం నాకు ఉండక తప్పదు. అలా అని నన్ను వదిలేస్తే ఎలా అని అప్పయ్య దీక్షితుల వేడికోలు.

క్షన్తవ్యం వా నిఖిలమపి మే భూతభావి వ్యలీకం
దుర్వ్యాపారప్రవణమథవా శిక్షణీయం మనో మే ।
న త్వేవార్త్యా నిరతిశయయా త్వత్పదాబ్జం ప్రపన్నం
త్వద్విన్యస్తాఖిలభరమముం యుక్తమీశ ప్రహాతుమ్ ॥

తాత్పర్యము

ఓ పరమేశ్వరా ! జరిగిన కాలంలో , జరుగబోయే కాలంలో నేను చేసిన , చేయబోయే పాపాలన్నింటిని క్షమించు. లేదా- దుర్మార్గపు పనులు (disreputable occupation or business) చేయుటకు ఉత్సాహపడే నా మనస్సును అయినా నీ అధీనంలోకి తెచ్చుకొని, పిచ్చి పిచ్చి పనులు చేయించకు. అంతేకాని- పోలికలేని దుఃఖంతో విలవిలలాడుతూ నీ పాద పద్మాలు పట్టుకొన్న ఈ శరణాగతుడిని (A votary, one who seeks refuge.)

– నీయందే నా సమస్త భారములు ఉంచిన ఈ దీనుడిని–కాపాడకుండా విడిచిపెట్టడం నీకు తగునా?(నన్ను ఎప్పుడు రక్షించుమని భావం).

విశేషాలు

దేనివల్ల జనము తమను తాము రక్షించుకొంటారో దానిని పాపమంటారు.పాపము చేసే వాడిని తాగేది కాబట్టి పాపం. (పా పానే)

1. పరద్రవ్యాపేక్ష, 2. అనిష్టచింతనం, 3. వితథాభినివేశము (పరలోకము లేదు, దేహమే ఆత్మయనెడి అభినివేశము) ఇవి మానస పాపములు, 4. కఠినోక్తి, 5. అసత్యోక్తి, 6. పరోక్షమున పరదూషణ చేయుట, 7. అసంబద్ధ ప్రలాపము ఇవి వాచిక పాపములు, 8. పరద్రవ్యము అన్యాయముగ గ్రహించుట, 9. నిషిద్ధ హింస, 10. పరదారగమనము ఇవి శరీర పాపములు. పాపాల గురించి మనం చిన్నప్పటినుంచి వింటున్నాం. నేను విన్న, చదివిన పెద్దల వాక్యాలను ఈశ్లోక వ్యాఖ్యానంలో మీకు తెలియచేసే ప్రయత్నం చేస్తాను.

1.కరచరణ కృతంవా కర్మ వాక్కాయజం వా
శ్రవణ నయనజం వా మానసంవాపరాధం।
విహిత మవిహితం వా సర్వమే తత్ క్షమస్వ
శివ శివ కరుణాబ్ధే శ్రీ మహదేవ శంభో ॥

(కాళ్ళూ చేతులతో చేసినది, వాక్కు, శరీరంతో చేసినది,చెవులు, కళ్ళతోనూ చేసినది, మనస్సుతో చేసినది అపరాధాలను, ఇష్టమైనవి, అయిష్టమైనవి చేసిన అన్ని అపరాధాలనూ క్షమించు మహాదేవా).

పాపం చేసేవాడినే కాదు మరికొంతమందిని కూడా అనుభవింపచేస్తుంది. వారు కర్తా, కారయితా, అనుమోదకః అనగా కర్త అనగా పాపం చేసేవాడు, కారయిత అనగా సహాయకుడు, అనుమోదకః అనగా బాగుందని మెచ్చుకుని కొట్టేవాడు. ఈ ముగ్గురూ పాపంలో భాగస్వాములే.

2.తడిసి మోపెడు" అని తరచూ వింటూంటాం

గుప్పెడు – మోపెడు అన్నవి తెలుగు భాషలో వున్న రెండు చక్కటి పదాలు.

ఏదైనా సరే తడవకపోతే చేతిలో పట్టుకోగలిగినట్లు "గుప్పెడే" ఉంటుంది.

తడిసినప్పుడు మాత్రం తలపై మోయలేనంత బరువెక్కి "మోపెడు" అవుతుంది. పుట్టుకతో మనం తెచ్చుకునే కర్మలు ఎప్పుడూ గుప్పెడే వుంటాయి! అయితే జీవనగమనంలో మనమే వాటిని తడుపుకుని అంటే అజ్ఞానంతో , పాపంతో బరువు పెంచుకుని మరి వాటిని "మోపెడు" చేసుకుని బెంబేలెత్తి పోతూవుంటాం!

3. తెలియక పాపం చేసి, పశ్చాత్తాపబడి తిరిగి ఆపాపాల జోలికి వెళ్ళనివానిని భగవంతుడు క్షమిస్తాడు . అయితే వరుసగా పాపాలు చేస్తూ గంగలో మునుగుతాం అంటే కుదరదు. శివుడేమీ అమాయకుడు కాదు కదా. సకలశాస్త్రాలకు కర్త ఆయన. అయినపుడు పాపాలను ఆయన ఎందుకు ప్రోత్సహిస్తాడు?

4. అంతేకాని పరుల ధనాన్ని చేజిక్కించుకున్నవారికి , పరాయివాని భార్యని ఆశించి పొందిన వానికి , ఇంటి యజమాని లేదా పెద్దలు లేనప్పుడు పిల్లలకి చెందాల్సిన ఆస్తిని కాజేసినవారికి శ్రాద్ధాదులు పెట్టిన , ఎన్ని దానాలిచ్చిన వారి పాపాలు నశించవు . ఆ పాపాలకి శిక్ష పైలోకాల్లోను , ఇక్కడ అనుభవించాల్సిందే.

5. పూర్వ జన్మ పాపాలు – నేటి ఖర్మలు మనిషి నేడు అనుభవిస్తున్న బాధలకు, ఖర్మకు పూర్వకర్మ కారణం. ఎందుకంటే ఈ లోకంలో ఏదీ కారణం లేనిదే జరుగదు. ప్రతిదానికీ ఒక కారణం ఉంటుంది. ప్రతి మనిషి పడుతున్న బాధలకు ఉన్న కారణాలేమిటి? ఇప్పుడు వాటిని ఎలా సరిదిద్దుకోవాలి అనే విషయాన్ని వివరించగలగడం జ్యోతిర్విజ్ఞానంలోని అద్భుతాలలో ఒకటి.

6. శౌనకమహాముని ధ్యానంలో ఉండి తన మాటకు సమాధానం చెప్పలేదని కోపించి ఒక చచ్చిన పామును ఆయన మెడలోవేసి పోతాడు పరీక్షిత్తు మహారాజు. ఈ పాపంవల్ల అతను తక్షకుని కాటుకు గురై మరణిస్తాడు. ఇది మహాభారతంలో మనకు తెలిసిన గాథ. పూర్వజన్మ పాపాలు వాటి ప్రభావాలను గురించి అంపశయ్యమీద ఉన్న భీష్ముడు ధర్మరాజుకు అనేక ఉదాహరణలతో వివరిస్తాడు. ఈ వివరాలు భారతంలో మనం చూడవచ్చు. కనుక కర్మ ఉన్నది. దాని ఫలితం అనుభవించడమూ ఉన్నది. ఇవి వాస్తవాలు.

7. పూర్వజన్మలో ఒక అమ్మాయి అసూయతో తన తోటి అమ్మాయిల పెళ్ళి సంబంధాలు చెడగొట్టేది. ఈ విషయం ఆ అమ్మాయి జాతకంలో స్పష్టం గా కనిపిస్తున్నది. ఈ జన్మలో ఆ అమ్మాయికి ఎన్ని పెళ్ళిసంబంధాలు వచ్చినా ఒక్కటీ కుదరటం లేదు.

గట్టిగా ప్రతిక్రియలు చేస్తే గాని ఈ దోషం పోదు.

8. ఒక వ్యక్తి గతజన్మలో తల్లిదండ్రులను పట్టించుకోకుండా గాలికొదిలేశాడు. ఈ జన్మలో ఇతను కొడుకులచేత వృద్ధాశ్రమం లో చేర్చబడి, పూర్వజన్మలో తన తల్లిదండ్రులను తాను పెట్టిన బాధను ఇప్పుడు అనుభవిస్తున్నాడు.

9. పూర్వజన్మలో ఇతను ఒక కన్యను గర్భవతిని చేసి ముఖం చాటేశాడు. ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుని చచ్చిపోయింది. ఈ జన్మలో ఇతనికి సంతానం లేదు. ఇప్పటికి రెండు పెళ్ళిళ్ళు చేసుకున్నాడు. ఇద్దరు భార్యలూ విషాద పరిస్థితుల్లో మరణించారు.

10. ఒక వ్యక్తి పూర్వజన్మలో తన భార్యను తన స్నేహితుడైన ఒక జమీందారుతో గడపమని బలవంతం చేసి ఆమె కాళ్ళావేళ్ళా పడ్డా వినక ఒప్పించాడు. ఈ జన్మలో భార్య తన స్నేహితునితో సంబంధం కలిగి ఉన్నది. ఆ సంగతి ఇతనికి తెలుసు. కాని ఏమీ చెయ్యలేడు. కారణం– ఇతనికి హఠాత్తుగా మగతనం పోయింది. ఇతను ఒక చిన్నరైతు. స్నేహితుడు అదే ఊళ్ళో మోతుబరిరైతు. ఇతను మానసికక్షోభతో పిచ్చివాడయ్యే పరిస్థితిలో ఉన్నాడు. భార్య ఇతన్ని పురుగులా చూస్తుంది. ఆమె ఆస్తి ఆమెకు ఉన్నది.

11. పూర్వజన్మలో ఇతను చాలామంది స్త్రీలను ఒకరికి తెలియకుండా ఒకరిని పెళ్ళి చేసుకుని వదిలేసేవాడు. ఈ జన్మలో ఇతను ఒక స్త్రీగా పుట్టాడు. మొదటి భర్త ఏక్సిడేంట్లో మరణించాడు. రెండవభర్త కొన్నాళ్ళు కాపురం చేసి ఒదిలేశాడు. ప్రస్తుతం ఈమె వయస్సు ముప్పై లోపే. పడుపువృత్తిలో కాలం గడుపుతున్నది.

12. ఒకామె పూర్వజన్మలో చీటికిమాటికి చెట్లను గిల్లడం,ఆకులు తెంపడం, చీమల్ని కాళ్ళతో చంపడం చేసేది. ఈజన్మలో మళ్ళీ స్త్రీగా పుట్టింది. ఈమెకు చీటికి మాటికి దెబ్బలు తగులుతూ ఉంటాయి. చిన్నచిన్న ఏక్సిడెంట్స్ అవుతూ ఉంటాయి. ఊరకే రోడ్డుపక్కగా పోతున్నాకూడా ఏదోవచ్చి ఈమెమీద పడి దెబ్బలు తగులుతూ ఉంటాయి. లేదా నడుస్తూ పోతూ గుమ్మాన్ని కొట్టుకుని తలకు దెబ్బలు తగులుతాయి. ఇలా ఉంటుంది పరిస్థితి.

13. వీరిలో చాలామంది పరిహారాలు చెప్పినా చెయ్యలేరు. పూర్వకర్మ గట్టిగా ఉన్నప్పుడు పరిహారాలు పాటించాలని బుద్ధి పుట్టదు. లేదా అనేక అవాంతరాలు వచ్చి మధ్యలోనే పరిహారాలు మానుకుంటారు. ఇలా జరగడం చాలా సార్లు జరుగుతుంది.

14. వీటన్నిటిని బట్టి జ్యోతిష్యశాస్త్రం మామూలు సైన్సు కాదు ఇది సూపర్ సైన్సు అని నేను గట్టిగా చెప్పగలను. ఈశాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకోడానికి ప్రస్తుత సైన్సుకు ఇంకా వెయ్యి సంవత్సరాలు పట్టవచ్చు అంటే అతిశయోక్తి కానేరదు (www.teluguyogi.net)

15. అన్ని దేవాలయాల్లో చేసే ప్రదక్షిణ వేరు. శివాలయంలో చేయాల్సిన ప్రదక్షిణ విధానం వేరు. శివాలయంలో ఏ విధంగా ప్రదక్షిణ చేయాలో, అలా చేయడం వల్ల ఎలాంటి ఫలితాలు పొందవచ్చో పురాణాల్లో స్పష్టంగా ఉన్నాయి. శివాలయంలో ధ్వజస్తంభం దగ్గర నుండి మనకి ఎడమపక్కగా బయలుదేరి గర్భాలయానికి వెనుకనున్న సోమసూత్రం (శివుని అభిషేకజలం బయటకు పోయే మార్గం) వరకు వెళ్లి వెనుతిరగాలి. కాని సోమసూత్రం దాటకూడదు.

16. అక్కడి నుండి వెనుకకు తిరిగి అ ప్రదక్షిణంగా మరల ధ్వజస్తంభాన్ని చుట్టుకుని సోమసూత్రం వరకూ రావాలి. ఇలా చేస్తే ఒక ప్రదక్షిణ పూర్తి చేసినట్లు. ఈ విధమైన ప్రదక్షిణలు శివుడికి భక్తులు తమ శక్త్యానుసారం బేసి సంఖ్యలో 3, 5, 7, 9 వచ్చే విధంగా చేయవచ్చు. శివప్రదక్షిణంలో సోమసూత్రాన్ని దాటరాదన్నది ప్రధాన నియమం. అలాచేస్తే ఎన్ని ప్రదక్షిణలు చేసినా ఒక ప్రదక్షిణ కిందకే వస్తుందంటారు.

17. ప్రదక్షిణం చేసేటప్పుడు..

యానికాని చ పాపాని జన్మాంతరకృతానిచ ।
తాని తాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదే పదే ॥
పాపోహం పాపకర్మాహం పాపాత్మా పాప సంభవ: ।
త్రాహిమాం కృపయా దేవ శరణాగతవత్సల ॥
అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ ।
తస్మాత్కారుణ్య భావేన భావేన రక్ష రక్ష మహేశ్వర ॥

అనే శ్లోకాన్ని పఠించాలి. అప్పయ్య దీక్షితులవారు తమ శ్లోకంలో కూడా ఈ అక్షర ప్రదక్షిణం చేసారు. పాపాలను క్షమించమని కోరారు. మనం కూడా అలా కోరదాం. స్వస్తి.

సర్వజ్ఞస్త్వం నిరవధికృపాసాగరః పూర్ణశక్తిః
కస్మాదేనం న గణయసి మామాపదబ్ధౌ నిమగ్నమ్ । 31

ఏకం పాపాత్మకమపి రుజా సర్వతోఽ త్యన్తదీనం
జన్తుం యద్యుద్ధరసి శివ కస్తావతాతిప్రసఙ్గః

తాత్పర్యము

ఓ శివా ! నువ్వు సర్వజ్ఞుడివి. అన్నియు తెలిసినవాడివి. మేర లేని దయా సాగరుడివి. నిండయిన శక్తి కలిగినవాడివి. అటువంటి నువ్వు ఆపదల సముద్రంలో మునిగిన నన్ను ఎందుకు లెక్కించవు? నేను అన్ని రకాలుగా బాగా దీనుడిని. పాపాత్ముడిని. రక్షించటానికి ఎవరు లేని ఒంటరిని బాధ పడుతున్న నన్ను ఉద్ధరిస్తే , అలాచేయమని నిన్ను వేడుకొంటేనా మాట నీకు అధిక ప్రసంగమవుతుందా!?

విశేషాలు

సర్వజ్ఞుడు సర్వజ్ఞ బిరుదము శంకరులకు, అపర శంకరులైన శంకరాచార్యుల వారికి కలదు. రావు సింగన గురించి శ్రీనాథుడు చెప్పిన పద్యం సర్వజ్ఞ నామధేయము

శర్వునకే రావు సింగ జనపాలునకే యుర్విం జెల్లును దక్కొరు సర్వజ్ఞుండనుట కుక్క సామజ మనుటే అనేది ఆయన అతని సముఖంలో చెప్పాడట. ఆ తర్వాత మిత్రులు "అదేమిటీ, రావు సింగ జనపాలుని అంతగా శివునితో పోల్చి పొగిడావు?" అనడిగితే, "అబ్బే, నేనెక్కడ పొగిడాను? నేను అన్నది ఏమిటంటే, "సర్వజ్ఞ నామధేయము శర్వునక్కే రావు సింగ జనపాలునికి - ఏ యుర్విం (ఏ లోకములో) చెల్లును? తక్కొరు(శివుని తప్పించి) ఇంకకరిని సర్వజ్ఞుండనుట కుక్క సామజ మనుటే"(కుక్కను ఏనుగనుటే) అంటూ అతను కుక్క అనే ధ్వనిని తోచేటట్లు చేసాను" అన్నాడట.

వివిధ దేశములలో కాశ్మీరము సర్వోత్కృష్టమైనది, ఆ దేశము ప్రఖ్యాత సర్వశాస్త్ర విశారదులకు నిలయము.

ఆ దేశమున గొప్ప శారదాదేవి ఆలయము గలదు. ఆ దేవాలయమున నొక సర్వజ్ఞ పీఠము గలదు. దాని నాలుగు ద్వారముల యందును సర్వతంత్ర నిష్ణాతులైన ప్రఖ్యాత పండితులుందురు.

అచట పండిత ప్రకాండుల నందరను ఎవడు సర్వతోముఖ పాండిత్యమున జయించి అపీఠము నధిష్ఠించునో, అతడు ''సర్వజ్ఞ'' దను ప్రఖ్యాతిని పొందగలడు. శంకరులా పీఠము సమీపమును జేరునాటికి ముగ్గురు మహాత్ములివ్విధముగ సర్వజ్ఞపీఠము నధిరోహించి, సర్వజ్ఞులను ఖ్యాతినొందియుండిరి. వారిలో నొకరు

తూర్పుదిక్కుననుండి, మరియొకరు పడమటి దిక్కుననుండియు, ఇంకొకరు ఉత్తరదిక్కునుండివచ్చిన వారై యుండిరి. వారిచే నా మూడుదిక్కుల యందలి ద్వారములు మూడు మాత్రము తెరువబడియుండెను.

దక్షిణదిక్కుననున్న ఆ శారదాలయమునందలి సర్వజ్ఞపీఠద్వారము ఇంత వరకు ఎవరిచేతనుగూడ తెరువబడి యుండలేదు. ఆ ద్వారమును తెరచి, పీఠము నధిరోహింప నెంచి, దక్షిణ దిక్కునుండి యిపుడు శంకరులకు, అచటి పండితోత్తములతో మహాప్రౌఢములగు వాదములన్ని విద్యలయందును సాగెను అనతికాలములోనే శంకరులచేత నందరు జితులైరి. జితులైన నా పండతులకందరకు నద్వైత తత్త్వమును బోధించి, శంకరులు వారి నద్వైత సిద్ధాంత నుయాయులనుగ జేసిరి

అంత శ్రీ శారదాదేవి ప్రత్యక్షమై శంకరునితో, "శంకరా ! నీవు సర్వజ్ఞుడవు సందేహము లేదు. ఈ సర్వజ్ఞపీఠమును నీ వధిరోహింపుము." అని స్వయముగ పలికి, శంకరునకు "సర్వజ్ఞ" యను బిరుదము నొసంగెను. అంత పండితేంద్రుల జయ శబ్దములు పలుకుచుండ నా శంకరుండు దక్షిన ద్వారమును తెరచి, సర్వజ్ఞపీఠము నధిరోహించెను. వాటినుండి శంకరుడు సర్వజ్ఞుడును సార్ధకబిరుదుముతో సర్వోత్కృష్టముగ ప్రకాశించుచుండెను. (శ్రీ జగద్గురు బోధలనుండి)

యః సర్వజ్ఞః సర్వవిత్' (ముణ్డకోపనిషత్ 1.1.9) – 'ఏ పరమాత్ముడు సామాన్య రూపమున సర్వమును ఎరిగినవాడో విశేష రూపమునను సర్వమును ఎరిగిన వాడో" అను శ్రుతి వచనము ఇందులకు ప్రమాణము

యద్యథావస్థితం వస్తు గుణదోషైస్స్వభావతః ।
యావత్ఫలం చ తత్పూర్ణం సర్వజ్ఞస్తు యథా వదేత్ ॥

ఏ వస్తువు ఎట్టి స్వరూపమును కలిగి యున్నదో, దానియందు స్వభావముచేతనే ఏయే గుణదోషములు గలవో, దాని ఫలము ఎంతటిదో అనే ఈ సర్వమును సర్వజ్ఞుడగు శివుడు యథాతథముగా చెప్పును. కాని, దీనికి భిన్నముగా జీవుడు రాగము, అజ్ఞానము మొదలగు దోషములకు వశుడై యుండుటచే, అసత్యమును పలుకుచుండును (21-23).)(శ్రీశివమహాపురాణములోని వాయవీయ సంహిత యందు పంచాక్షర మంత్రమహిమను వర్ణించే పన్నెండవ అధ్యాయము)

శ్వేతా శ్వేతరము అనే ఉపనిషత్తులో ఒక్కచోట శక్తి గురించి ప్రస్తావన ఉంది.

'అస్య పరాస్య శక్తిః వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బల క్రియాచ

"%అస్య' ఇతనికి ఉండేటటువంటి 'శక్తిః' యోగ్యత 'పరా' సాటిలేనిది.

ఎలా ఉంటుంది ? 'వివిధైవ శ్రూయతే' ఎన్ని రకాలుగా ఉంటుందో మనకు తెలియదు.

'స్వాభావికీ' అంటే సహజంగానే ఆ శక్తి స్వామికి ఉన్నది. స్వాభావికం అంటే ఎవరో ఇచ్చింది అని అర్థం. కానీ స్వాభావికీ అన్నప్పుడు అది సహజంగా ఉన్నది అని అర్థం. సుగంధం అని చెప్పినప్పుడు ఇది పరిమళాన్ని కృత్రిమంగా కలిగినది అని అర్థం చెబుతుంది. సుగంధి అని చెప్పినప్పుడు సహజంగానే ఉన్న పరిమళం అని అర్థం, గందపు చెక్కను నూరితే వచ్చే గందానికి ఉన్న పరిమళం లాంటిది. అలానే స్వాభావికం అంటే మారే లక్షణం కలవాడు అని అర్థం. కానీ భగవంతుడికి ఉండే గుణాలు ఎప్పటికీ మారనివి, అందుకే స్వాభావికీ అని చెబుతారు. ఎవరో ఇచ్చినవి కావు. ఎప్పటికీ పోనివి ఏమిటవి ?

'జ్ఞాన బల క్రియాచ' ఆయనకుండే జ్ఞానం స్వాభావికీ.

బలము స్వాభావికీ. ఆయన చేసే పనులూ స్వాభావికీ. .(శ్రీ జియ్యర్ స్వామి)

శివస్య పరిపూర్ణస్య పరానుగ్రహమంతరా బ

న కించదపి కర్తవ్యమితి సాధు వినిశ్చితమ్ (శివ మహా పురాణం)

పరానుగ్రహము కొరకే స్వామి అన్ని చేతలు

దుఃఖమేవ హి సర్వోపి సంసార ఇతి నిశ్చితమపి

శక్తులు

మన పురాణముల ప్రకారం శక్తులు ఐదు రకములు

అవి

1. పరాశక్తి : ఆకర్షణకు కారణము - ఇది దైవిక శక్తి
2. ఆదిశక్తి : మనలోని పంచ ప్రాణములకు ఆధారము - ఇది స్వాభావికమైన శక్తి
3. జ్ఞానశక్తి : జ్ఞానమునకు కారణం, ఇంద్రియముల శక్తికి ఆధారం
4. ఇచ్ఛాశక్తి : ఆలోచనలకు, సంకల్పమునకు ఆధారం
5. క్రియా శక్తి : శారీరికమైన క్రియలకు ఇది ఆధారం.

ఇచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తి స్వరూపిణీ అని అమ్మవారికి ఒక నామము.
స్వేచ్ఛాసంకల్పశక్తి, జ్ఞానకారకమైన శక్తి, కార్యాచరణ శక్తుల స్వరూపిణిగా ఉంది

శివ శబ్దానికి ఇచ్ఛాశక్తి కలిగిన పరమేశ్వరుడని ఒక అర్థం. సృష్టికి పూర్వం ఉన్న శుద్ధమైన పరమాత్మ సంకల్పం నుంచి ఈ ప్రపంచం అంతా పుట్టింది. అలాంటి ఇచ్ఛాశక్తి కలిగినపుడు పరమేశ్వరుడికి శివుడు అనిపేరు. శివ అంటే ఇచ్ఛాశక్తి కలిగినవాడు.

అతి ప్రసంగము(అతి వ్యాప్తి)

అతి వ్యాప్తి అంటే హద్దు దాటి వ్యాపించుట, తర్కలక్షణ దోషము. లక్ష్యము కానిదానియందు లక్షణము ప్రవర్తించుట అను దోషము అతివ్యాప్తి లేక అధిక ప్రసంగము (తర్కశాస్త్రము.)

మనుష్యుడు బ్రాహ్మణుడు - అనునది బ్రాహ్మణునకు లక్షణమనినచో క్షత్రియాదులును మనుష్యులే కావున వారియందును ఈ లక్షణము చెల్లవలసి వచ్చును. అందువలన ఈ లక్షణము అతివ్యాప్తి దోషదూషితమైనది. సరియైనది కాదని భావము.(వ్యతిరేకము. అవ్యాప్తి.).

అత్యన్తార్తివ్యథితమగతిం దేవ మాముద్ధరేతి
క్షుణ్ణో మార్గస్తవ శివ పురా కేన వా?నాథనాథ। 32
కామాలమ్బే బత తదధికాం ప్రార్థనారీతిమన్యాం
త్రాయస్వైనం సపది కృపయా వస్తుతత్త్వం విచిన్త్య ॥

తాత్పర్యము

ఓ అనాథ నాథ ! పరమశివా ! నాకంటే ముందే ఒక దారిని పెద్దలు వేసారు.
"నేను బాగా దుఃఖంతో ఉన్నాను. దిక్కు తెలియటం లేదు. నన్ను ఉద్ధరించు" అనేది ఆదారి. ఈ దారి ఆనేక మంది చేత పూర్తిగా చదును చేయబడిన, పొడి చేయబడిన దారి(అనేకమంది ఈ దారిని అనుసరించారని భావం) ఈ దారి వేసిన మహానుభావులు ఎవరో ! దీనికంటే గొప్పదారి , ప్రార్థనా పద్ధతి నాకు తెలియదు. ఇంకోదారి లేని వాడిని.సంసార దుఃఖంతో నిండిన నా వాస్తవ పరిస్థితిని తెలుసుకొని, ఆలోచించి , దయతో నన్ను కాపాడవయ్యా.

విశేషాలు

శరణు కోరడం శరణాగతి. అలా శరణు పొందినవాడు శరణాగతుడు. భగవద్గీత 18వ (చివరి) అధ్యాయంలో 66వదైన %ఃఃః%సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ/ అహంత్వా సర్వపాపేభ్యో మోక్ష యిష్యామి మాశుచః%% శ్లోకం శరణాగతి అంటే ఏమిటో వివరిస్తున్నది. %ఃఃః%అన్ని ధర్మాలను వదలి నన్ను శరణు పొందితే సమస్త పాపాల నుంచి విముక్తి కలిగిస్తాను, దుఃఖించవద్దు%% అని శ్లోకానికి భావం.

భక్తి యోగాన్ని అనుసరించడానికి ఏవైనా పాపాలు ప్రతిబంధకంగా ఉంటే వాటి నుంచి విముక్తి కలిగిస్తానని శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పాడు. ఈ శ్లోకం చివరి అధ్యాయంలోని చివరిది కాకపోయినా %ఃఃః%చరమ శ్లోకం%%గా ప్రసిద్ధిలోకి వచ్చింది.

1వ అధ్యాయం అర్జునుడి శోకాన్ని గూర్చి చెప్పేది.

2వ ఆధ్యాయంలో 11 వ శ్లోకం వరకు శ్రీకృష్ణుడు పలికిన ఉపోద్ఘాతము లాంటిది. అసలు భగవద్గీత ఉపదేశం 2వ అధ్యాయపు 12 వ శ్లోకం నుండే ప్రారంభం అయ్యింది.

"నత్వేవాహం జాతునాసం నత్వం నేనే జనాధిపాః" మొదలుకొని చివర 18వ అధ్యాయపు 66 వ శ్లోకం "సర్వధర్మాన్ ... మా శుచః" వరకే ఉపదేశం సమాప్తం అవుతుంది చరమ శ్లోకంలో "మా శుచః" ఏడవకు అని అర్జునుడిని ఓదార్చాడు. భగవద్గీత ఒక్కొక్క ఒక్కొక్క అధ్యాయంలో అనేక ఉపాయాలని ఉపదేశం చేసి, అన్ని ఉపాయాల్లో చిట్టచివరిది ఇది, దీన్ని మించిన ఉత్తమ ఉపాయం సాధనం మరొకటి లేదు.

శరణాగతి నేరుగా మోక్షాన్ని సాధించనూ వచ్చు, భక్తియోగంలోకి ప్రవేశింపజేసి, మోక్షానికి యోగ్యుడుగా చేయనూవచ్చు. శరణాగతిని ఆత్మ క్షేప న్యాయమనీ, ప్రపత్తి అనీ, భరన్యాసమనీ, అదృష్టార్థమనీ కూడా అంటారు. న్యాసవిద్య అని కూడా వేదాంత పరిభాషలో వాడుక ఉంది. బ్రహ్మ విద్యలలో శరణాగతి ఒకటని ఉపనిషత్తులు తెలియజేస్తున్నాయి. నమ్మాళ్వారు మొదలైన ఆళ్వారులు భగవదను గ్రహానికి శరణాగతి మార్గాన్నే ప్రబోధించారు. భక్తి యోగాన్ని అనుసరించ లేని అశక్తత, శాస్త్ర నిషిద్ధాలు, స్థిరైన జ్ఞానం లేకపోవడం, మోక్షసాధనలో ఏర్పడే అంతరాయాలను భరించలేక

పోవడం అనే నాలుగు కారణాలు గానీ, అందులో ఏ ఒకటో రెండో ఐనాగానీ ఉంటే శరణాగతి మార్గం అనుసరించడానికి యోగ్యత ఉన్నట్లేనని వేదాంత దేశికుల రచనలు (ప్రపత్తి యోగం) తెలియజేస్తున్నాయి. అహిరీబుధ్న్యసంహితలో శరణాగతికి సంబంధించిన షడంగాలను వివరించారు. అవి :

1. అనుకూల సంకల్పం,
2. ప్రతికూల వర్జనం,
3. దేవుడు తప్పక రక్షిస్తాడనే దృఢ విశ్వాసం (రక్షస్యతి ఇతి విశ్వాసః),
4. గోప్తృత్వ వరణం (రక్షించడం),
5. ఆత్మనిక్షేపం (తనను తాను అర్పించు కోవడం),
6. కార్పణ్యం (తనను ఆదుకొనేవారు ఎవరూ లేరనే దీనత్వ స్థితి).

మనం చెప్పుకొన్న అప్పయ్య దీక్షితుల వారి శ్లోకంలో **నేను బాగా దుఃఖంతో ఉన్నాను. దిక్కు తెలియటం లేదు. నన్ను ఉద్ధరించు** అనే దారి ఈ శరణాగతులకు సంబంధించినదే

భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా

"॥ గీత 61 ॥

అంటే సమస్త ప్రాణులహృదయమందుండి ఈశ్వరుడు జగన్నియామకుడుగ ప్రభువుగా శాసకునిగ రాజు ప్రజలను శాసించినటుల సమస్త ప్రా ణికోట్లను శాసించును. కనుక నన్ను బంధాలనుండి విడిపించు అని ప్రార్థన. స్వస్తి.

ఏతావన్తం భ్రమణనిచయం ప్రాపితో?యం వరాకః
శ్రాన్తః స్వామిన్నగతిరధునా మోచనీయస్త్వయాహమ్ ।33
కృత్యాకృత్యవ్యపగతమతిర్దీనశాఖామృగోఽయం
సంతాడ్యైనం దశనవివృతిం పశ్యతస్తే ఫలం కిమ్ ॥

తాత్పర్యము

శివా ! ప్రభూ ! ఇంతవరకు ఈ దీనుడు (వరాకః) అనేక జన్మలలో తిరిగి తిరిగి అలసిపోయాడు. (శ్రాన్తః) నాకు దిక్కు లేదు. నేను నీచేతనే రక్షింపబడవలసిన వాడను. నువ్వే నన్ను రక్షించాలి. చేయవలసిన మంచి, చేయకూడని చెడుల మధ్య విడదీయటానికి వీలుగా ఉన్న సన్నపాటి రేఖను గుర్తించలేని కోతిని. నన్ను కొట్టి నా పంటి సందులను చూడటం వలన నీకు ప్రయోజనమేమున్నది. (నన్ను బాధలు

పెట్టవద్దని భావం)

విశేషాలు

1. వ్యపగతలేపాలాజాన్యాయము సొరకాయబుఱ్ఱను మట్టితో నింపి నీటిలోబడవైచిన నది మునుగును. నీరు తగిలి మట్టి అంతయు నీటిలో కఱగి పోయిన తేలికయై వెంటనే నీటిపైకి వచ్చును. దేహముతో సంబంధ మున్నంతవఱకు ఆత్మ సంసార సముద్రములో మునిగియుండును. ఆయువు క్షీణించి దేహము నశించినవెనువెంటన ఆత్మ అచట నిలువక ఎకాయకి ఊర్ధ్వముఖముగ ఆకాశమున కెగిరిపోవును. ఈ న్యాయము వ్యపగత పద ప్రయోగము వలన జ్ఞప్తికి వచ్చుచున్నది.

2. శాఖామృగము - చెట్ల కొమ్మలపై తిరుగు మృగమును శాఖామృగము అంటారు.. సంసారవృక్ష మఘబీజ మనన్తకర్మ - శాఖాయుతం కరణపత్ర మనఙ్గపుష్పమ్ ఆరుహ్య దుఃఖఫలినం పతతో దయాలో! లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలమ్బమ్. (లక్ష్మీనృసింహ కరావలంబ స్తోత్రం)(ఈ సంసార వృక్షమునకు పాపమే బీజము. సమస్త కర్మలు దాని శాఖలు, ఇంద్రియములు ఆకులు. మన్మథుడు పూవులు. దుఃఖములు ఫలములు. ఆ వృక్షమును ఎక్కి క్రింద పడిపోయాను.. ఓ నరసింహదేవా! చేయూత నిచ్చి నన్ను ఉద్ధరింపుము.) అనుశ్లోకంలో కూడా ఈ శాఖామృగ ప్రస్తావన అంతర్లీనముగా ఉంది.

మాయాపాశేన బధ్నామి పశూ నేతాన్ స్వలీలయా ।
మా మేవ మోచకం ప్రాహుః పశూనాం వేదవాదినః ॥ 19
మాయాపాశేన బద్ధానాం మోచకో?న్యో న విద్యతే ।
మా మృతే పరమాత్మానం భూతాధిపతి మవ్యయమ్ ॥

సంసారములో నుండు ఆత్మలన్నియు పశువులుగా చెప్పబడినవి. వారికి పతిని కావున నన్ను పండితులు పశుపతి యందురు. ఈ పశువులనన్నిటిని నాలీలలో మాయాపాశముతో బంధించెదను. వేద విదులు ఈ పశువుల బంధమును విడిపించువాడను నేననియే చెప్పుచుందురు. మాయా పాశ బద్ధులను విడిపించుటకు భూతాధిపతిని. పరమాత్మను అయిన నేను తప్ప ఇతరులు లేరు. (16-20)

ఇది షట్సాహస్రియను కూర్మపురాణమున ఉత్తర విభాగమున 7వ అధ్యాయము

మాతా తాతః సుత ఇతి సమాబధ్య మాం మోహపాశై-
రాపాత్యైవం భవజలనిధౌ హా కిమీశ త్వయా??ప్తమ్ ?
ఏతావన్తం సమయమియతీమార్తిమాపాదితే?స్మిన్
కల్యాణీ తే కిమితి న కృపా కాపి మే భాగ్యరేఖా ? 34?

ఈశ్వరుడా ! అమ్మ. నాన్న, కుమారుడు ఇలాంటి మోహ (మనోవైకల్యము)పాశాలతో నన్ను బంధించి, బాధపెడుతున్నావు.(ఆబాధవ దుఃఖము) నన్ను ఇలా సంసారపు సముద్రములో పడవేయటం వలన నువ్వు ఏమి పొందావు? ఏతావన్తం సమయమియతీమార్తిమాపాదితే?స్మిన్ ఇంతవరకు, ఇంత దుఃఖపడిన ఈ భక్తునియందు శుభకరమైన నీ దయ అనెడి రేఖ నాకు కలగదా! (శుభాలను కలిగించమని ప్రార్థన.)

విశేషాలు

అష్ట-పాశములు

(అ.) 1. దయ, 2. శంక, 3. భయము, 4. లజ్జ, 5. జుగుప్స, 6. కులము, 7. శీలము, 8. జాతి.

(ఆ.) 1. పశుపాశము, 2. భవపాశము, 3. బంధపాశము, 4. మోహపాశము, 5. ఆశాపాశము, 6. కర్మపాశము, 7. దుఃఖపాశము, 8. క్లేశపాశము.

భాగ్యరేఖ

పూనిన భాగ్యరేఖ చెడిపోయినపిమ్మట నెట్టి మానవుండైనను
వాని నెవ్వరుఁ బ్రియంబునఁబల్కరు పిల్వ రెచ్చటం దానది ।
యెట్లొకో యనినఁ దథ్యము పుష్పము వాడి వాసనా హీనత
నొందియున్న యెడనెవ్వరు ముట్టుదురయ్య భాస్కరా ॥

భావం

ఎంతవాడైనా కాలం కలిసిరానప్పుడు వాడితో ఎవరు ప్రియంగా మాట్లాడరు, వాడిని ఎక్కడికి పిలవరు, వాడిపోయిన పుష్పంలాగా వాడిని ఎవరు స్వీకరించరు.

మాతా పితా గురుజనః స్వజనో మమేతి
మాయోపమే జగతి కస్య భవేత్ప్రతిజ్ఞా ।
ఏకో యతో వ్రజతో కర్మపురఃసరోఽయం ।
విశ్రామవృక్షసదృశః ఖలు జీవలోకః(శివగీత) ॥

భుజక్ష్వ గుప్తం బత సుఖనిధిం తాత సాధారణ త్వం ।
భిక్షావృత్తిం పరమభినయన్మాయయా మాం విభజ్య ॥ 35
మర్యాదాయాః సకలజగతాం నాయకః స్థాపకస్త్వం ।
యుక్తం కిం తద్వద విభజనం యోజయ స్వాత్మనా మామ్ ॥

ఓ తండ్రీ !నువ్వు సాధారణమైన ఆనందపు గుప్త సుఖ నిధిని ఆస్వాదిస్తున్నావు.తరువాత భిక్షావృత్తిని స్వీకరించావు. బ్రహ్మాండంగా నటన చేస్తూ మాయతో ప్రపంచమంతటా హద్దులను విభజించావు. నాయకుడివి. నువ్వే స్థాపకుడివి. నాతో ఈ విభజన నీకు తగునా! నీలో నన్ను కలుపుకో.

న త్వా జన్మప్రలయజలధేరుద్ధరామీతి చేద్ధీః
ఆస్తాం తన్మే భవతు చ జనిర్యత్ర కుత్రాపి జాతౌ ।36
త్వద్భక్తానామనితరసుఖైః పాదధూలీకిశోరైః
ఆరబ్ధం మే భవతు భగవన్ భావి సర్వం శరీరమ్ ॥

తాత్పర్యము

ఓ భగవానుడా!పరమశివుడా! నన్ను నువ్వు ఈ జన్మప్రళయ సముద్రమునుంచి తప్పించుకోదలుచుకోలేదనుకో.ఫరవాలేదు.ఏ జాతి లోనయినా నన్ను పుట్టించు.కాని ఒక చిన్న విన్నపం. ఏ పుట్టుకలో నేను ఉన్నా- నా శరీర నిర్మాణములో ఒక వరం నాకు అనుగ్రహించు.నీకు తమ భక్తిచేత నిజ సుఖాన్ని కలిగించే భక్తుల పాదధూళితోనే నా శరీర నిర్మాణము ప్రారంభించు.

విశేషాలు

భగవానుడు

1.భగ శబ్దానికి ఐశ్వర్యం, ధర్మం, వైరాగ్యం, జ్ఞానం మొదలైన చాలా అర్థాలు ఉన్నాయి. అవి కలిగినవాడు భగవంతుడు/ భగవానుడు.

2. సమగ్ర ఐశ్వర్యం కలిగినవాడు.

3. సమస్త భూతముల జ్ఞానం కలిగిన వాడు.

4. ఏది జ్ఞానమో ఏది అజ్ఞానమో తెలిసినవాడు.

జాతి

పురుషజాతులు నాలుగు. - భద్రుడు, దత్తుడు, కూచిమారుడు, పాంచాలుడు.

స్త్రీ జాతులు నాలుగు.-

పద్మిని, హస్తిని, శంఖిని, చిత్రిణి.

పదునెనిమిది జాతులు.-

బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర, వ్యావహారిక, గోరక్షక, శిల్పక, పంచాణ, కుంభకార, తంతువాయ, క్షౌరక, రజక, వస్త్రచ్ఛేదక, చర్మకార, తిలఘాత, లుబ్ధక, చండాల, మాతంగజాతులు.

కీటా నాగాస్తరవ ఇతి వా కిం న సన్తి స్థలేషు
త్వత్పాదామ్భోరుహపరిమలోద్వాహిమన్దానిలేషు। 37
తేష్వేకం వా సృజ పునరిమం నాథ దీనార్తిహారిన్
ఆతోషాన్మాం మృడ భవమహాఘోరనద్యాం లుఠన్తమ్ ॥

దీనుల ఆర్తిని హరించువాడా ! ఓ పరమశివా! లోకంలో వీచే చిరుగాలులు నీ పాద పద్మ సుగంధములను తమలో కలుపుకొంటాయి. అలాంటి చిరుగాలులు వీచే స్థానాలలో కీటకాలు, ఏనుగులు, చెట్లు ఉంటాయి కదా! నేను పుట్టుకల నిప్పుల ప్రవాహంలో దొర్లిపోతున్నాను. ఈ దీనుడిని నీ తృప్తి కలిగేంతవరకు పుట్టుకల నిప్పుల ప్రవాహంలో దొర్లించు.కాదనటానికి నేనే పాటి వాడిని?! కాని ఒక చిన్నవిన్నపం.నీ పాద పద్మ సుగంధములను తమలో కలుపుకొన్న చిరుగాలులు వీచే స్థానాలలో ఉన్న కీటకాలు, ఏనుగులు, చెట్లు ఒకరిగా నన్ను సృష్టించు.

కాలే కణ్ఠస్ఫురదసుకలాలేశసత్తావలోక-
వ్యగ్రోదగ్రవ్యసనిసకలస్నిగ్ధరుద్ధోపకణ్ఠే। 38
అన్తస్తోదైరవధిరహితామార్తిమాపద్యమానో-
ఽప్యంఘ్రిద్వన్ద్వే తవ నివిశతామన్తరాత్మన్ మమాత్మా ॥

తాత్పర్యము

ఓ అంతర్యామీ ! నా చివరి దశలో కంఠంలో కొద్దిగా మిగిలిన ప్రాణం గొంతులో కదులుతుంటుంది.దానిని చూసి బంధువులు, ఆత్మీయులు దుఃఖంతో పూడుకుపోయిన గొంతుకలతో శోకిస్తుంటారు. ఆ సమయంలో నాకు కూడా లోపలలోపల దుఃఖము ఉప్పొంగుతుందేమో ! కాని పరమశివా ! ఆ సమయంలో కూడా నా ఆత్మ నీ పాదపద్మములమీదే నిలిచేటట్లు వరము ఇవ్వు.

విశేషాలు

%I%. పంచ ప్రాణములు

ప్రాణము అనగా నిండింపబడినది అని పదము యొక్క అర్థం. పంచ ప్రాణములు అని ప్రసిద్ధి.

1. ప్రాణము (హృదయమున నుండునది),

2. అపానము (గుదమున నుండునది),

3. సమానము (నాభి మండలమున నుండునది),

4. ఉదానము (కంఠమున నుండునది),

5. వ్యానము (శరీరమంతట వ్యాపించి యుండునది).

%II%. శ్రీ భగవద్గీత లోని 8 వ అధ్యాయం ఐన అక్షరపరబ్రహ్మ యోగం లోని 5 వ శ్లోకం

"అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరం/యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః%౬%ఎవరైతే అంత్య సమయములో నన్ను స్మరిస్తూ ప్రాణాలు వదులుతారో వారు నన్నే పొందుతారు. ఈ విషయంలో సందేహము లేదు %

III%. మరణసమయంలో పంచాక్షరీమంత్రం

కాశీలో మృతి చెందినవారికి మరణసమయంలో శివుడే స్వయంగా వారికి చెవిలో పంచాక్షరీమంత్రం చెబుతాడని తెనాలి రామకృష్ణుడు పాండురంగ మాహాత్మ్య కావ్యంలో చెప్పాడు.

ఒకనాడు దీర్ఘోపయోగిగాని శరుండు
నౌఁదల ధరియించు నభ్రగంగ
నాఁపొద్దు పోయిరాఁజనట్టి నిర్వేదయు
భోగించు నైశ్వర్యములెనిమిదియు
బుష్కరాక్షుల పొంతఁబోని వర్షవరుండు
దేహార్ధమునదాల్చు తీగఁబోఁడి
నాయుధ ప్రభఁగాంచి యలగు భీరువుబూను

వాఁడి ముమ్మొనల వేఁడి యలుగు
ంలిన వర్తనుఁడును సుధాలలితమూర్తి
మించి వర్తించు, మతిలేని మేదకుండు
మౌనివర్యులఁ జదివించు మఱ్ఱి నీడఁ
బంచముఖువీట మేనోసరించెనేని.

కాశిలో మరణిస్తే ప్రతివాడు శివుడై పోతాడు. ఒక్కరోజు కూడా ఏ తీర్థమూ సేవించని మూఢుడు కూడా నెత్తిమీద గంగని ధరిస్తాడు.

కటిక పేదవాడు కూడా అష్టైశ్వర్యాలూ అనుభవిస్తాడు. నపుంసకుడు శివునిలాగా అర్ధనారీశ్వరుడౌతాడు. ఆయుధముల పట్ల పిరికివాడు కూడా వాడియైన మూడు మొనలుగల తీక్షణమగు ఆయుధము (త్రిశూలము)ను చేత ధరిస్తాడు.

చెడు నడత గలవాడు కూడా స్వచ్ఛమైన శరీరముకల చంద్రుని మించి ప్రకాశిస్తాడు.
మతిలేని వాడు కూడా మఱ్ఱి చెట్టునీడన మునులకు విద్యాబోధ చేస్తాడట.

సాధకుడు మరణసమయంలో చేసే ప్రార్థనలు.

ఈశావాస్య ఉపనిషత్తులో 15, 16 మంత్రాలు సత్యదర్శనం కోసం ప్రత్యక్షదైవమైన సూర్యుణ్ణి గురించి సాధకుడు మరణసమయంలో చేసే ప్రార్థనలు.

'ఓ సూర్యుడా! నీ బంగారు బింబం నీలోని సత్యాన్ని మూసివేసింది. నాకోసం ఆ మూతను తొలగించు' (మం. 15).

' నీ తేజాన్ని, కిరణాల్ని ఉపసంహరించి నీ నిజస్వరూపాన్ని చూడటానికి వీలుగా నన్ను అనుగ్రహించు. నీలోని పురుషుడూ నేనూ ఒకటే'(మం. 16).

శరీర పతనానంతరం జీవులు కర్మఫలాన్ని అనుభవించడానికి దేవయానం (అర్చిర్మార్గం) పితృయానం(ధూమమార్గం) అను రెండు మార్గాలలో ప్రయాణం చేస్తారు. కాంతిమార్గమైన దేవయాన మార్గంలో పయనించే వారికి బ్రహ్మలోకప్రాప్తి వస్తుంది. పితృయాన మార్గంలో ప్రయాణం చేసేవారు చంద్రలోకానికి వెళ్ళి కర్మఫలం అయిన తర్వాత తిరిగి జన్మిస్తారు.

ముకుందమాలలో -

కృష్ణ త్వదీయ పదపంకజ పంజరాంత /
మద్యైవ మే విశతు మానసరాజహంసః /
ప్రాణ ప్రయాణ సమయే కఫ వాత పిత్తైః /
కంతావరోధన విధౌ స్మరణం కుతస్తే ?"

(కృష్ణా! ఇప్పుడే నామనస్సు నీ పాదపంకజ పంజరములో ప్రవేశించుగాక. మరణసమయంలో కఫ, వాత, పిత్తాలతో – నా గొంతుకి అడ్డు కలిగితే నిన్ను ఎలా తలుచుకోగలను ?) అన్నారు కులశేఖరాళ్వారులు ముకుందమాలలో.

అన్తర్బాష్పాకులితనయనానన్తర్గనపశ్యన్
అగ్రే ఘోషం రుదితబహులం కాతరాణామశ్రుణ్వన్ ।
అత్యుత్క్రాన్తిశ్రమమగణయన్ అన్తకాలే కపర్దిన్
అఙ్ఘ్రిద్వన్ద్వే తవ నివిశతామన్తరాత్మన్ మమాత్మా ॥ 39

ఓ జడముడి జంగమా !పరమశివా !బయటి వారికి మాత్రము కాక, తనకు మాత్రమే సంబంధించిన వారు ఆంతరంగీకులు. అటువంటివారు నేను చనిపోతున్న సందర్భంలో లోలోపల ఏడుస్తుంటారు. ఏడ్చి ఏడ్చి కళ్లు కలత చెంది, వాపుతో ఉంటాయి. పెద్దగా అరుస్తుంటారు. నా చివరికాలములో వారిని చూడక, వారి రోదనలను నీపాదపద్మములపై నా మనస్సు ఉండుగాక ! ప్రానములు శరీరమునుండి బయటికి వెళ్లేటప్పుడు విపరీతమైన శ్రమ ఉంటుందట కదా ! అయినా సరే–ఆశ్రమను లెక్కించక నా చివరికాలములో నీపాదపద్మములపై నా మనస్సు ఉండుగాక !

చారుస్మేరాననసరసిజం చన్ద్రరేఖావతంసం
ఫుల్లన్మల్లీకుసుమకలికాదామసౌభాగ్యచోరమ్ ।
అన్తఃపశ్యామ్యచలసుతయా రత్నపీఠే నిషణ్ణం
లోకాతీతం సతతశివదం రూపమప్రాకృతం తే ॥ 40

తాత్పర్యము

పరమశివా ! అందమయిన చిరునవ్వుతో వికసించిన ముఖ పద్మము కలిగినవాడివి. చంద్రరేఖను శిరోభూషణముగా కలిగినవాడివి, వికసిస్తున్న మల్లికా పుష్పమాల సౌందర్యాన్ని హరించే రూపము కలిగినవాడివి. పార్వతీదేవితో కలిసి రత్న పీఠముపై కూర్చున్నవాడివి. లోకా తీతమైన , మాయాతీతమైన, అసాధారణమైన (అప్రాకృతము) నీ రూపాన్ని అంతరంగంలో చూస్తున్నాను.

విశేషాలు

తస్మాత్సహ తయా శక్త్యా హృది పశ్యంతి యే శివమ్ ।
తేషాం శాశ్వతికీ శాంతిర్నేతరేషామితి శ్రుతిః ॥

ఎవరైతే శక్తితో గూడియున్న శివుని హృదయములో దర్శించెదరో, వారికి మాత్రమే శాశ్వతమగు శాంతి లభించుననియు, ఇతరులకు కాదనియు వేదము చెప్పుచున్నది (20).

(శ్రీ శివ మహాపురాణములోని వాయవీయ సరిహతయందు ఉత్తరఖండలో శివభక్తియొక్క మహిమను వర్ణించే ఏడవ అధ్యాయము)

స్వప్నే వాపి స్వరసవికసద్దివ్యపఙ్కరుహాభం
పశ్యేయం కిం తవ పశుపతే పాదయుగ్మం కదాచిత్ ।
క్వాహం పాపః క్వ తవ చరణాలోకభాగ్యం తథాపి
ప్రత్యాశాం మే ఘటయతి పునర్విశ్రుతా తే?నుకమ్పా ॥

ఓ పశుపతీ ! నీ దివ్యమైన పాదముల జంట సహజ కాంతితో- నిగనిగలతో కూడిన వికసించిన పద్మాలతో సమానమైనవి. నీ పాదముల జంటను నేను ఎప్పుడైనా కలలో అయినా చూడగలనా!? పాపి ని అయిన నేనెక్కడ? నీయొక్క పాదములను చూచుట ఎక్కడ? అయినప్పటికి-నీ అంతులేని దయ నాకు నీ దివ్యమైన పాదముల జంట చూచు ఆసక్తిని కలిగించుచున్నది.

భిక్షావృత్తిం చర పితృవనే భూతస్థః భ్రమేదం
విజ్ఞాతం తే చరితమఖిలం విప్రలిప్సోః కపర్దిన్ ।
ఆవైకుణ్ఠద్రుహిణమఖిలప్రాణినామీశ్వరస్త్వం
నాథ స్వప్నే?ప్యహమిహ న తే పాదపద్మం త్యజామి ॥ 42

ఓ కపాలీ ! నువ్వు భిక్షా వృత్తిని ఆచరించావు. శ్మశానంలో భూతగణాలతో తిరుగాడావు. ఇదంతా ఎందుకో నాకు తెలుసు. నీ మాయను మరుగు పరచడానికి. వైకుంఠము, బ్రహ్మలోకము, ప్రాణుల సమూహము వీటికి నువ్వే అధిపతివి కలలో కూడా నీ పాదపద్మాలను విడువను.

విశేషాలు

ధనపతి సఖుడై యుండియు నెనయంగా శివుడు భిక్ష మెత్త లసెన్
దన్వారి కెంత గలిగిన తనభాగ్యమె తనకు గాక తథ్యము సుమతీ.

భావం:-

ధనవంతుడైన కుబేరుడు స్నేహితుడైనప్పటికినీ ఈశ్వరుడు బిచ్చమెత్తుట సంభవించెను. కాబట్టి, తనవారి కెంత సంపదయున్నను, తన కుపయోగపడదు, తన భాగ్యమే తనకు ఉపయోగించును.

ఆలేపనం భసితమావసథః శ్మశానం
అస్థీని తే సతతమాభరణాని సన్తు ।
నిహ్నోతుమీశ సకలశ్రుతిపారసిద్ధం
ఐశ్వర్యమమ్బుజభవో?పి చ న క్షమస్తే ॥ 43

పరమేశా ! నీ శరీరపు పూత భస్మము. నీ నివాసము శ్మశానము. ఎముకలు నీ ఆభరణములు. అయినప్పటికీ అన్ని వేదాలు- ఉపనిషత్తులద్వారా సిద్ధించు నీ ఐశ్వర్యమును దాచుటకు బ్రహ్మ కూడా సమర్థుడు కాడు.

వివిధమపి గుణౌఘం వేదయన్త్యర్థవాదాః
పరిమితవిభవానాం పామరాణాం సురాణామ్ ।   44
తనుహిమకరమౌలే తావతా త్వత్పరత్వే
కతి కతి జగదీశాః కల్పితా నో భవేయుః ॥

ఓ పరమేశ్వరా ! దేవతలు పరిమిత విభవము కలవారు. వారిని వర్ణించు వివిధ స్తుతులు ఉండుగాక ! ఓ శశిధరా ! అపరిమిత విభవము కల నీకు ఎన్ని స్తుతులు ఉండాలి?

విశేషాలు

అర్థ వాదం : పారమార్థిక పదకోశం (పొత్తూరి వేంకటేశ్వరరావు) 2010   Report an error about this WordMeaning

హిందూ

1. స్తుతి (శ. ర.). 2. వేదభాగ విశేషం. 3. విధి నిషేధ వాక్యాలను సమర్థించి బోధించడం కోసం నిందగా గానీ, స్తుతిగా గానీ వివరణ చేయడం. పురాకల్పం, ఇతిహాసం గూడ అర్థవాదాలే. (శ్రీ. సూ. ఆం. ని.) 4. అర్థవాదాలు ఏడు విధాలని "మాయా వివరణమ్" (ఆదిశంకరుల రచన) తెలియజేస్తున్నది. అవి: (1) సృష్టి, (2) స్థితి, (3) ప్రళయం, (4) ప్రవేశం, (5) సంయమనం (నియమనం), (6) తత్త్వం పదార్థశోధన, (7) ఫలప్రతిపాదకం. మట్టిలో నుంచి వచ్చిన కుండ మొదలైన పాత్రలు

మట్టి కంటే ఎలా భిన్నం కావో ఆకాశం మొదలైన వన్నీ ఆత్మలోనే ఉంటున్నాయి. ఆత్మలోనే లయం పొందు తున్నాయి కనుక అవన్నీ బ్రహ్మము. శ్రుతి వాక్యాలు ఆధారంగా ఈ విధమైన ఏడు అర్థవాదాలు ఈ పద్ధతిలోనే రూపొందాయి.

5. ఒక ముఖ్యమైన విశేషాన్ని గాని, పారమార్థిక సత్యాన్ని గాని, నీతిని గాని తెలియజేయడానికి ఉపయోగించే సాహిత్య ప్రక్రియ. "సమయం, సందర్భం కాకుండా ఇదేమిటి" అనిపించే విధంగా చెప్పదలచుకున్న విషయాన్ని చెప్పడం ఈ ప్రక్రియ ప్రత్యేకత. రామాయణంలో రామరావణ యుద్ధం జరుగుతున్నప్పుడు అగస్త్య మహర్షి వచ్చి రాముడికి "ఆదిత్య హృదయం" ఉపదేశించడం, కురుక్షేత్ర సంగ్రామం మధ్య శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతో పదేశం చేయడం ఇందుకు ఉదాహరణలు. భీకర యుద్ధం మధ్య ఇంతసేపు ఉపదేశాలు చేయడం ఏమిటనే ప్రశ్న పాఠకుల మనస్సులో మొలకెత్తవచ్చు. అయితే, సందర్భం తీవ్రతను బట్టి పాఠకులకు విషయం తప్పనిసరిగా మనస్సుకెక్కి స్థిరంగా ఉండడం అనే ప్రయోజనం ఈ ప్రక్రియవల్ల కలుగుతుంది. అర్థము అంటే వస్తువు, ప్రయోజనం అనే అర్థాలు కూడా ఉన్నాయి. ప్రయోజనంతో కూడిన ప్రక్రియ ఇది.

విహర పితృవనే వా విశ్వపారే పురే వా
రజతగిరితటే వా రత్నసానుస్థలే వా ।   45
దిశ భవదుపకణ్ఠం దేహి మే భృత్యభావం
పరమశివ తవ శ్రీపాదుకావాహకానామ్ ॥

ఓ పరమశివా ! పితృవనంలో అయినా, విశ్వాంత నగరములో అయినా, కైలాసములో అయినా ,బంగారుకొండల స్థలములో అయినా ఎక్కడయినా విహరించుము.నీ పాదుకలను మోయు నీ సేవకులకు సేవకునిగా ఉండు భాగ్యం కలిగించుము.

బలమబలమమీషాం బల్బజానాం విచిన్త్యం
కథమపి శివ కాలక్షేపమాత్రప్రధానైః ।
నిఖిలమపి రహస్యం నాథ నిష్కృష్య సాక్షాత్
సరసిజభవముఖ్యైః సాధితం నః ప్రమాణమ్ ॥

ఓ శివా ! నీ ఉనికి గురించి ,బలిమిని గురించి గడ్డి మాటలు (సార హీనములైన) చాలా ఉన్నాయి .అవి కేవలం కాలక్షేప మాత్ర ప్రధానములు. వాటిని గురించి

ఆలోచించటం వ్యర్థం. నీ రహస్యముల గురించి బ్రహ్మాది దేవతలు పరిశ్రమించి అనేక తత్వములు సాక్షాత్కరింపచేసారు. ఆతత్వములే మాకు ప్రమాణము.

న కించిన్మేనే?తః సమభిలషణీయం త్రిభువనే
సుఖం వా దుఃఖం వా మమ భవతు యద్భావి భగవన్ । 47
సమున్మీలత్పాథోరుహకుహరసౌభాగ్యముషితే
పదద్వన్ద్వే చేతః పరిచయముపేయాన్మమ సదా ॥

తాత్పర్యము

ఓ భగవాన్ ! పరమశివా ! నా భవిష్యత్తు సుఖమైనా, దుఃఖమైనా కానీ ! నాకు ఫర్వాలేదు. వికసించే పద్మాలశోభను తిరస్కరించే నీ పాదద్వయముపై నా మనస్సును నిత్యము ఉండునట్లు చేయి. మూడు లోకాలలో ఇంతకుమించి నేను కోరదగినది ఏమి లేదు.

ఉదరభరణమాత్రం సాధ్యముద్దిశ్య నీచే-
ష్వసకృదుపనిబద్ధామాహితోచ్ఛిష్టభావామ్ ।48
అహమిహ నుతిభ్గమర్పయిత్వోపహారం
తవ చరణసరోజే తాత జాతోఽ పరాధీ ॥

తాత్పర్యము

ఓ పరమశివా !ఉదరభరణము (supporting life, filling the belly) కోసం నీచులను అనేక మార్లు పొగిడాను నా నాలుక జీవితంతో పాటు ఎంగిలి అయింది. ఈ ఎంగిలి నాలుకతో నీస్తుతి చేస్తున్న పాపిని. ఇప్పుడు పరిహారంగా నీకు కానుకగా ఈ ఆత్మార్పణ స్తుతిని నీ పాద పద్మముల దగ్గర అర్పిస్తున్నాను. పుట్టుక మొదలు అపరాధిని అయిన వీడిని క్షమించు.

సర్వం సదాశివ సహస్వ మమాపరాధం
మగ్నం సముద్ధర మహత్యముమాపదబ్ధౌ ।
సర్వాత్మనా తవ పదామ్బుజమేవ దీనః
స్వామిన్ననన్యశరణః శరణం ప్రపద్యే ॥

ఓ సదాశివా ! నానేరములను పూర్తిగా సహించవయ్యా !ఆపదల మహాసముద్రములో మునిగిన నన్ను పైకి తీసుకురావయ్యా !స్వామీ !వేరే ఎవరిని

శరణు వేడను. అన్ని విధాలుగా నీ పాద పద్మములను మాత్రమే ఈదీనుడు శరణముగా పొంది ఉన్నాడు.

ఆత్మార్పణస్తుతిరియం భగవన్నిబద్ధా
యద్యప్యనన్యమనసా న మయా తథాపి ।
వాచాపి కేవలమయం శరణం వృణీతే
దీనో వరాక ఇతి రక్ష కృపానిధే మామ్ ॥

తాత్పర్యము

ఓ భగవానుడా ! పరమశివా ! నేను ఇతరమునందు మనస్సులేనివాడినికాను., ఏకాగ్రమనస్సుగలవాడినికాను. ఒకేదృష్టి గలవాడిని కాను. (అనన్యమనస్కుడు) ఏదో మాట మాత్రంగా ఈ ఆత్మార్పణ స్తుతిని చేస్తున్నాను. నిన్ను శరణు కోరుతున్నాను. నన్ను మన్నించు ఈదీనుడిని, పేరు లేనివాడిని, (వరాకుడు)వెర్రివాడిని రక్షించు.

విశేషాలు

భగవానుడు అనే పదానికి నాలుగు అర్థాలు

భగ శబ్దానికి యోని, ఐశ్వర్యం, ధర్మం, వైరాగ్యం, జ్ఞానం మొదలైన చాలా అర్థాలు ఉన్నాయి. అవి కలిగినవాడు భగవానుడు. 2. సమగ్ర ఐశ్వర్యం కలిగినవాడు. 3. సమస్త భూతముల జ్ఞానం కలిగిన వాడు. 4. ఏది జ్ఞానమో ఏది అజ్ఞానమో తెలిసినవాడు

అనన్యమనస్కుడు

నిజానికి అప్పయ్య దీక్షితులవారు పిచ్చెక్కిన పరిస్థితిలో కూడా శివునియందు ఏకాగ్రమనస్సుగలవారై ఇంతటి అత్యద్భుతమైన ఆత్మార్పణ స్తుతి రచించారు. కాని "నేను ఇతరమునందు మనస్సులేనివాడినికాను" అనుటలో వినయము మనము గ్రహించాలి..

కృపానిధే

శరణం భవ భవ శరణం భవ భవ శరణం భవ భవ
కరుణాబ్ధే గిరిశ మహాపజ్జలధేరస్మానుద్ధర ధీర కృపాజలధే

అను శరణు కోరే శివపరమైన వేలాది శ్లోకాలకు పునాది ఈ శ్లోకంలోని "కృపానిధే" సంబోధన.

ఉపసంహారం

ఈ రోజుతో(07-04-2017) అప్పయ్య దీక్షితుల ఆత్మార్పణ స్తుతి (ఉన్మత్త పంచశతి)లోని 50 శ్లోకాల తాత్పర్యవిశేష రచనము స్వామి దయతో పూర్తయింది.

ఈ అల్పజ్ఞునిచే ఈ విధమైన సేవ చేయించుకొన్న పరమశివునికి అంతర్దృష్టి ప్రణామములు.

ఈ విశేషముల వివరణములో నేను ఉటంకించిన గ్రంథకర్తలకు, నిఘంటు కారులకు కృతజ్ఞతలు

అప్పయ్యదీక్షితుల ఆత్మార్పణ స్తుతిని నాచేత రికార్డింగ్ చేయిస్తూ , ప్రతిరోజూ ఉదయం 11-30 ని.లకు ప్రసారం చేస్తున్న జయజయ శంకరటీవీ యాజమాన్యానికి ధన్యవాదములు.

ఆత్మార్పణ స్తుతి సర్వము సంపూర్ణము.

ఓమ్ తత్ సత్

-డా. తాడేపల్లి పతంజలి

ఇతి శ్రీమదప్పయ్యదీక్షితేన్ద్రాణాం కృతిశ్వన్యతమా ఆత్మార్పణస్తుతిః సమ్పూర్ణా